ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు



TGTEL/25/A1132

మానవాళికి

# జనంవార్త

ప్రతి అక్షరం.. జనం కోసం..





'జనంవార్త'

మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...

సెల్ : 8522 055 889



మేడ్చల్ | శనివారం | 11.07.2026 | సంపుటి : 2 | సంచిక : 10 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్


15 నుంచి ఈహెచ్ఎస్

## హెల్త్ కార్డులు

ఉద్యోగులతో భేటీలో సిఎస్ నిర్ణయం 02



ఎవరో స్క్రిప్టు రాసిస్తే మాట్లాడే వ్యక్తిని కాదు : ఎంపీ ఈటల 03

# కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా తొక్కేస్తా

182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తాం

బావామర్దులు కలసి ఊరుమీద పడి తిరుగుతున్నారు

కెసిఆర్‌ను ఫామ్‌హౌజ్‌కే పరిమితం చేసేశాం

తెలంగాణలో 20 ఎంపి సీట్లు గెలిపిస్తే రాహుల్ ప్రధాని

మధిర రైతు ఆశీర్వాద సభలో భరోసా నిధులు విడుదల

సభలో సింఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవన్నారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని.. 2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో 117 సీట్లకు పైగా గెలుస్తామని, ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురంలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు.

ఖమ్మం, జూలై 10 : ఖమ్మం జిల్లాలో జరిగిన రైతు ఆశీర్వాద సభ కాస్తా..ఎన్నికల ప్రచార సభగా మారింది. రాహుల్‌ను ప్రధానిని చయే యడమే తమ లక్ష్యమని సిఎం రేంవత్ రెడ్డి ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 20 పార్లమెంట్ సీట్లు గెలిపించాలని, దీంతో రాహుల్‌ను ప్రధానిని చేద్దామని ప్రజలకు పిలుపునిచ్చారు. అలాగే వచ్చే ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌దే అధికారమని కూడా రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని చెప్పారు. అసెంబ్లీ స్థానాల సంఖ్య 119 నుంచి 182కి.. లోక్‌సభ స్థానాలు 17 నుంచి 26కి పెరుగుతాయని చెప్పారు. 2029 మే-జూన్‌లో శాసనసభ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 182 స్థానాల్లో

-మిగతా 2 లో..

గతంలో రైతుబంధు కోసం

## తిప్పించుకున్నారు

పండించిన ప్రతి గింజను కొంటున్నాం 03

రైతు ఆశీర్వాద సభలో డిప్యూటీ సిఎం భట్టి



నీటిపారుదల మంత్రిగా

# హరీష్ చేసిందేమిటి?

హరీష్ రావు వ్యాఖ్యలపై మండిపడ్డ టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్‌లోకి వస్తామంటే ఆలోచిస్తామని వెల్లడి

బిఆర్ఎస్ నిధులపై కవిత వ్యాఖ్యల్లో నిజముందని వెల్లడి

మూడు నెలలు నీటి పారుదల మంత్రిగా అవకాశం ఇస్తే నీటి సమస్యను పరిష్కరించి చూపిస్తానంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆ తరవాత ఆలోచిస్తామని అన్నారు. శుక్రవారం గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. హరీశ్ రావు నిజంగా కాంగ్రెస్‌లోకి వస్తానంటే పార్టీలో చర్చిస్తామన్నారు. పొలిటికల్ ఎఫైర్స్ కమిటీలో చర్చించి హరీశ్‌ను చేర్చుకోవాలా? వద్దా? అని నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

హైదరాబాద్, జూలై 10 : పదేండ్లు ఏం చేయని వారు మూడు నెలల సమయంలో ఏం చేస్తారని అన్నారు.హరీశ్‌రావు పదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారు? ఆయన జలవనరులశాఖ మంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన ప్రాజెక్టే కుంగింది.. దాని గురించి ఏం చెప్పాలి. పదేళ్లు మంత్రిగా ఉంటూ ఏం చేశారు?.. మళ్లీ మూడు నెలలు ఎందుకు? బీఆర్ఎస్ పార్టీ నిధులపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణల్లో నిజముంది. ఒక ప్రాంతీయ పార్టీకి రూ.1,400 కోట్లు ఎలా వచ్చాయి? హరీశ్‌రావు కాంగ్రెస్‌లోకి వస్తానంటే కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.' అని మహేశ్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ అప్పులు, తప్పులను సరి చేస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత గొడవలపై మహేశ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ పార్టీలో భిన్నాభిప్రాయాలు సహజమన్నారు. మంత్రి

-మిగతా 2 లో..

సకలం చెరువు శిఖంలో

# ఫాతిమా కాలేజీ

హైడ్రా ఎందుకు అక్కడికి వెళ్లడం లేదు

ఎంఐఎంకు కాంగ్రెస్ ఎందుకు కొమ్ము కాస్తోంది

ఎక్స్ వేదికగా బండి సంజయ్ విమర్శలు



హైదరాబాద్, జూలై 10 : ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా మహిళా కళాశాల.. సకలం చెరువు పరిధిలో ఉందని కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి ఆరోపించారు. ఇది ప్రపంచమంతా చూస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం చూడనట్లు నటిస్తోందని ఆయన మండిపడ్డారు. కళ్లున్నా చూడనట్లు నటిస్తూ ఎంఐఎం తొత్తుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఎంఐఎం పార్టీని లక్ష్యంగా చేసుకుని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘాటు విమర్శలు చేశారు. పేదల ఇళ్లను హైడ్రా పేరుతో కూల్చివేస్తున్న ప్రభుత్వం.. అందరికీ కనిపిస్తున్న ఈ ఆక్రమణను మాత్రం ఎందుకు గుర్తించలేకపోతోందని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్

-మిగతా 2 లో..



## అబద్దాలకు పేటెంట్ రేవంత్

ఖమ్మం సభలో అబద్దాలతో మభ్య పెట్టారు

మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు 02

టిఆర్ఎస్‌ను గెలిపిస్తే..

# అక్కరాజ్యం చూపిస్తా

తమ ప్రభుత్వంలో రైతుకు కుర్చీ వేసి గౌరవిస్తాం

మహిళల కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రకటిస్తాం

గిరిజనుల సమస్యలై ఢిల్లీ దాకా కొట్లాడుతాం

పాంచజన్యంతో ముందుకు వెళతామన్న కవిత



భద్రాద్రి కొత్తగూడెం, జూలై 10 : ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేనను గెలిపిస్తే.. రైతును రాజును చేసి చూపిస్తానని ప్రజలకు ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో రైతుకు ప్రత్యేక కుర్చీ వేయిస్తామని తెలిపారు. త్వరలోనే మహిళల కోసం ఒక ప్రత్యేకమైన వినూత్న ఆలోచనను చేశానని చెప్పారు. దీనిని త్వరలోనే ప్రకటిస్తానని పేర్కొన్నారు. అన్న రాజ్యం కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని తెలిపారు. కొత్త పార్టీలో మార్పులు ఉంటాయని.. 'పాంచజన్యం' పేరుతో

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

కూకట్‌పల్లి ముత్తూట్‌లో

# భారీ మోసం

ఖాతాదారుల బంగారానికి రెక్కలు

పక్కదారి పట్టించిన మేనేజర్ ప్రియాంక రెడ్డి

రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టిన పోలీసులు 03






కోహెడలో హోల్‌సేల్

# చేపల మార్కెట్

రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మాణం 02

శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి

కన్నెపల్లి పంపు హౌస్ నుంచి

# నీటిని ఎత్తిపోయాలి

ప్రాణహితలో నీళ్లు పారుతున్న కనిపించడం లేదా

ఎపికి సాయం చేసేందుకే రేవంత్ మిన్నకున్నారు

యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ మహాధర్నా



03

## నీటిపారుదల మంత్రిగా హరీష్ చేసిందేమిటి?

(మొదటిపేజీ తరువాయి)

కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. తుంగతుర్తి సమస్య కూడా పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇరు వర్గాల వాదనలు వింటామన్నారు. పార్టీలో అందరూ సమానమే అని తేల్చిచెప్పారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బిజీగా ఉండడం వల్ల ఇద్దరు సీనియర్ నాయకులను సమస్య పరిష్కారం కోసం నియమించామని అన్నారు. సస్పెండ్ చేయడమే పరిష్కారం కాదన్నారు. వరంగల్‌లో మంత్రి కొండా సురేఖ- ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తుంగతుర్తిలో నేతల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. దీనిపై ఇప్పటికే ఇద్దరు సీనియర్లను పరిశీలకులుగా నియమించామని చెప్పారు. వరంగల్ అంశాన్ని సచిన్ సావంత్‌కు, తుంగతుర్తి బాధ్యతను జగ్గారెడ్డికి అప్పగించాం. అందరితో చర్చించి ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటాం. ప్రభుత్వాన్ని కూలగొడతామని అన్నప్పుడు.. పది మంది ఎమ్మెల్యేలు తమకు మద్దతు ఇచ్చారని చెప్పారు. నీళ్ల దోపిడీ జరిగినప్పుడు ఈటల మంత్రిగా ఉన్నారని మహేశ్ గుర్తుచేశారు.



## టిఆర్ఎస్‌ను గెలిపిస్తే.. అక్క రాజ్యం చూపిస్తా

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు వెళ్తామని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. ఎంత పెద్ద సమస్యకైనా మొదటి అడుగుతోనే పరిష్కారం.. తన ప్రయాణానికి మీ సహకారం కావాలని ప్రజలను కోరారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం కొత్త గంగారం గ్రామం ఆదివాసి నాయకపోడు గ్రామాల్లో సమస్యలు వారి జీవన విధానాన్ని తెలంగాణ రక్షణ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాజకీయాల కోసం రాలేదని.. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికే మీ ముందుకు వచ్చానని అన్నారు. వెనకబడిన ఆదివాసీ గిరిజనుల కోసమే 'తెలంగాణ రక్షణ సేన' పార్టీని స్థాపించానని వివరించారు. సమాజంలో ఉన్న వెనకబడిన వ్యవస్థను మార్చడానికే ఆడబిడ్డగా ధైర్యంగా తాను ముందుకు వచ్చానని పేర్కొన్నారు. మీ గ్రామానికి రావడం పుట్టింటికి వచ్చినట్లుగా ఉంది.. గ్రామ దేవతల దర్శనం కల్పించిన ప్రజలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణలో ఎక్కడా మార్పు రాలేదు.. నిరుద్యోగం, కరెంట్ కష్టాలు ఇంకా పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకపోడు జాతిని 'గోండు నాయకపోడు' అని పిలవడం తీవ్ర బాధాకరమని అన్నారు. 1950 రికార్డుల్లో నాయకపోడు పేరు లేకపోవడం దురదృష్టకరం.. గిరిజనుల హక్కుల కోసం ఢిల్లీ దాకా పోరాడుతామని పేర్కొన్నారు. తెలంగాణలో ఆదివాసీకి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంకులు లోన్ ఇవ్వడం లేదని అన్నారు. బ్యాంకులు లూటీ చేసిన వారి అప్పులు మాఫీ చేసిన బీజేపీ సర్కార్.. గిరిజనులకు ఎందుకు రుణాలు ఇవ్వట్లేదు? అని ఆ పార్టీ నేతలను కవిత సూటిగా ప్రశ్నించారు. విదేశాల తరహాలో ఇక్కడి ఆదివాసీలకు రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు బ్యాంక్ లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించాలి.. ఇది వారి ప్రాథమిక హక్కు అని అన్నారు. ఎస్టీలకు కేటాయించిన వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని కల్వకుంట్ల కవిత ఆరోపించారు.



## కోహెడలో హోల్‌సేల్ చేపల మార్కెట్

**రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మాణం**

**శంకుస్థాపన చేసిన మంత్రి వాకిటి శ్రీహరి**

**రంగారెడ్డి,జూలై10 :** రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేసారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, ఫ్రూట్ మార్కెట్ చైర్మన్ చిలుక మధు, రంగారెడ్డి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు దూస వెంకటేష్, ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ మురళీకృష్ణ, అడిషనల్ కలెక్టర్ చంద్రా రెడ్డి, మత్స్యకారులు పాల్గొన్నారు. తెలంగాణ మత్స్య రంగ చరిత్రలో మరో చారిత్రక ఘట్టంగా నిలిచే కోహెడలో అంతర్జాతీయ మంచినీటి చేపల ఎగుమతుల కేంద్రం శంకుస్థాపనకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సముద్రతీర ప్రాంతం కాకుండా దేశంలోనే తొలిసారిగా అంతర్గత రాష్ట్రంలో ఇటువంటి ఆధునిక ఎగుమతుల కేంద్రం ఏర్పాటు కావడం తెలంగాణకు గర్వకారణం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, వారికి శాశ్వత ఉపాధి కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లకు అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో సుమారు రూ.47 కోట్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. తెలంగాణ ప్రస్తుతం మంచినీటి చేపల ఉత్పత్తిలో దేశంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. 2025లో రాష్ట్రంలో సుమారు 4.20 లక్షల టన్నుల చేపలు, 15 వేల టన్నుల మంచినీటి రొయ్యల ఉత్పత్తి నమోదైంది. ఈ ఎగుమతుల కేంద్రం అందుబాటులోకి రావడంతో రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేపలకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లు లభించి మత్స్యకారులకు మెరుగైన ధరలు అందనున్నాయి. తెలంగాణ చేపలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు దక్కనుంది. ఈ కేంద్రంలో ఆధునిక శీతల గిడ్డంగులు, శుద్ధి యూనిట్లు, ప్యాకేజింగ్ కేంద్రాలు, శిక్షణా కేంద్రం, కస్టమ్స్ సదుపాయాలు, భారీ హోల్‌సేల్ మార్కెట్ వంటి అన్ని ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. సుమారు 2 వేల మంది వ్యాపారులు ఇక్కడ వ్యాపారం నిర్వహించే అవకాశం ఉండగా, లోడింగ్, అన్‌లోడింగ్, ప్యాకేజింగ్, రవాణా తదితర రంగాల్లో సుమారు 5 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు కేవలం చేపల మార్కెట్ మాత్రమే కాకుండా తెలంగాణ మత్స్య రంగాన్ని ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానం చేసే అభివృద్ధి వేదికగా నిలవనుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు యువతకు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించనుంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు సహకరించిన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు, మత్స్యకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే ప్రతి చేపకు ప్రపంచ మార్కెట్ అందించడమే మా లక్ష్యం. మత్స్యకారుల కుటుంబాల్లో ఆర్థిక సంతోషం నింపడమే మా ప్రభుత్వ సంకల్పం.' అని ప్రభుత్వం పేర్కొంది.



# భద్రాద్రి రాముడిపై ఆన..
# వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు మావే

(మొదటిపేజీ తరువాయి)

117 సీట్లకు పైగా గెలుస్తామని.. ఇది భద్రాచలం రాముడిపై ఆన అని రేవంత్ వ్యాఖ్యానించారు. రైతుభరోసా తుది విడత సాయం పంపిణీ సందర్భంగా ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం జగన్నాథపురం లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్, భాజపాపై విమర్శలు చేశారు. ఇక్కడి ప్రజలను చూస్తే నా గుండె పులకిస్తోంది. రాజకీయంగా నాకు పాలమూరు ప్రాణం. నా రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పనిచేసింది. నేడు వరి కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నాం. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారు. నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారు. ఉచిత కరెంట్.. కాంగ్రెస్ పేటెంట్ రైట్. మా ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70లక్షల కోట్లు ఖర్చు చేశాం అని రేవంత్ అన్నారు. కల్వకుంట్ల కుటుంబాన్ని తెలంగాణ రాజకీయ ముఖచిత్రం నుంచి పాతాళానికి తొక్కే వరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు విశ్రమించరని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో వస్తున్నారని కొందరు చెప్పారు. వాళ్లని ఎలా ఎదుర్కోగలరని ప్రశ్నించారు. వాళు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తోందని ఆనాడే చెప్పా.



ఎన్నికల్లో మాకు 64 సీట్లు వచ్చాయి. ఉప ఎన్నికల్లో మరో 2 గెలిచాం. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లోనూ గుండు సున్నా తప్పదని చేవెళ్ల సభలో చెప్పా. అన్ని ఎన్నికల్లోనూ నేను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారు. ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫాంహౌస్‌కి పరిమితం చేశాం. కౌరవ వంశాన్ని తెలంగాణ గడ్డ నుంచి తొలగిస్తాం. కాసుకో కేసీఆర్.. నిన్ను, నీ బంధువులను, సర్వేలను ఓడిస్తాం. మిమ్మల్ని ఓడించేందుకు రోజూ 18 గంటలు పనిచేస్తాం. మోదీ, అమిత్‌షా ఇతర పార్టీలను లొంగదీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే తృణమూల్ కాంగ్రెస్, ఆప్‌లను చీల్చారు. ఇతర పార్టీలను కూడా లొంగదీసుకుని లోక్‌సభ సీట్ల పెంపు బిల్లును ఎలా అయినా ఆమోదింపజేసుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ విషయంలో వారు విజయం సాధించడానికి అవకాశం ఉందని రేవంత్ అన్నారు. ఇకపోతే రైతు భరోసా తుది విడత నిధులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. ఖమ్మంలో జరిగిన రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. అన్నదాతల నిధులు విడుదల చేసేందుకు బటన్ నొక్కారు. అనంతరం భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణలో పదేళ్లపాటు బీఆర్ఎస్ రాక్షస పాలన సాగిందని సీఎం రేవంత్ అన్నారు. వారి పాలనలో రైతులకు బేడీలు వేశారని మండిపడ్డారు. దీంతో ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అనేది లేకుండా ప్రజలు చేశారని ఆయన చెప్పుకొచ్చారు. ఖమ్మం జిల్లాలో 2023లో ఓ అద్భుతం జరిగింది. బీఆర్ఎస్‌ను కాదని కాంగ్రెస్‌లోకి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చారు. దీంతో ఆనాడు కాంగ్రెస్‌లోకి ఉప్పెనలా జనం వచ్చారు. కారు పార్టీని ప్రజలు ఇక్కడ మళ్లీ మొలకెత్తనీయకుండా చేశారు. 2023 ప్రభుత్వ ఏర్పాటు నుంచి ఏ ఎన్నికలైనా కాంగ్రెస్‌దే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేశారు.

అన్నదాతల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేశాం. ప్రతి సందర్భంలోనూ వారిని ఆదుకుంటూ వస్తున్నాం. రైతు కళ్లల్లో ఆనందమే మాకు ఆశీర్వాదం. కల్వకుంట్ల కుటుంబంలో ఒకరంటే ఒకరికి నమ్మకం లేదు. కుళ్లు, కుతంత్రాలు, కుట్రలతో బయటకు వస్తున్నారు. అధికారం పోయిందనే అక్కసుతోనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు. బావా బామ్మర్దులిద్దరూ ఊళ్లపై పడి తెగ తిరుగుతున్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని విషప్రచారం చేశారు. ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకోండి.. సలసల మాడిపోతారు. ఆనాడు డబుల్ బెడ్‌రూమ్‌ల పేరుతో సినిమా కథలు చెప్పారు. ఇప్పుడు పొంగులేటి 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్‌లు ఓపెన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. కన్నెపల్లి పంప్‌లు ఆన్ చేస్తే భద్రాచల రాముడి ఆలయం సహా 44 గ్రామాలు కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. కేసీఆర్ ఇంట్లో ఒకరంటే ఒకరికి పడదు. బీజేపీతో హరీశ్ రావు మంతనాలు జరుపుతున్నారో, లేదో భద్రాచల రాముడిపై ఒట్టేసి చెప్పాలి. కారు పార్టీలో ఉంటావో లేదో కేసీఆర్‌పై ఒట్టేసి హరీశ్ రావు చెప్పాలి. తాటిచెట్టంత పెరిగినా ఆయనకు బుర్రలో గుజ్జు లేదు. బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని కేటీఆర్ చెల్లెలే చెబుతున్నారని తెలిపారు.



## కూకట్‌పల్లి ముత్తూట్‌లో భారీ మోసం

**ఖాతాదారుల బంగారానికి రెక్కలు**

**పక్కదారి పట్టించిన మేనేజర్ ప్రియాంక రెడ్డి**

**రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టిన పోలీసులు**




**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలో భారీ మోసం వెలుగులోకి వచ్చింది. ముత్తూట్ ఫైనాన్స్ మేనేజర్ ప్రియాంకరెడ్డి వినియోగదారుల బంగారాన్ని మరో సంస్థలో తాకట్టుపెట్టారు. తద్వారా కోట్ల రూపాయలు దారి మళ్లించినట్లు సమాచారం. ఈ మోసానికి పాల్పడ్డట్లు గుర్తించడంతో వ్యవహారం బయటపడింది. తాకట్టుపెట్టిన బంగారం ఇప్పించాలని పలువురు వినియోగదారులు ప్రియాంకను నిలదీశారు. ఆమె పొంతనలేని సమాధానాలు చెప్పడంతో భారీ మోసం బయటపడింది. ఈ ఘటనపై కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో వినియోగదారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడకు చెందిన ప్రియాంకరెడ్డి.. కేపీహెచ్‌బీ ఆరో ఫేజ్‌లోని ముత్తూట్ ఫైనాన్స్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ముత్తూట్‌లో బంగారం డిపాజిట్ చేస్తే రూ.1.40 వడ్డీకి రుణాలు ఇస్తుంటారు. ప్రియాంక మాత్రం 50 పైసలకే ఇస్తానని నమ్మబలికి వినియోగదారులను బురిడీ కొట్టించింది. ఆ వడ్డీ ముత్తూట్‌కు కాకుండా సొంత ఖాతాకు జమచేయించుకునేది. తీసుకున్న రుణంపై టాపప్ ఇప్పిస్తానంటూ ఓటీపీలు చెప్పించుకుని మరో మోసానికి తెరలేపింది. టాపప్ ద్వారా వచ్చే డబ్బును వినియోగదారులకు చేరకుండా తన ఖాతాలోకి మళ్లించుకునేది. ఈ క్రమంలో తనతో పాటు ముత్తూట్‌లో పనిచేసేవారితో పక్కనే మరో ఫైనాన్స్ సంస్థ ప్రారంభించింది. ముత్తూట్ వినియోగదారులకు తెలియకుండానే డిపాజిట్ చేసిన బంగారు ఆభరణాలను ఆ సంస్థలో డిపాజిట్ చేయించేది. అనంతరం ఇతర సంస్థలకు అధిక వడ్డీలకు ఇస్తూ సొమ్ము చేసుకునేది. ఓ వృద్ధుడు తాను తీసుకున్న రుణం తీర్చి బంగారు ఆభరణాలు తీసుకునేందుకు గురువారం సంస్థ వద్దకు వచ్చారు. రుణం చెల్లించిన తర్వాత ఎంతకీ ఆభరణాలు ఇవ్వకపోవడంతో ఆయన ప్రియాంకరెడ్డిని నిలదీశారు. గమనించిన కొందరు వినియోగదారులు కూడా మేనేజర్‌ను ప్రశ్నించారు. చివరికి మోసపోయినట్లు గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టామని ఎస్‌హెచ్‌వో రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆడిట్ చేయిస్తే ఎంత మోసం జరిగిందో తెలిసే అవకాశం ఉందన్నారు.

## అబద్ధాలకు పేటెంట్ రేవంత్

- **ఖమ్మం సభలో అబద్ధాలతో మభ్య పెట్టారు**
- **మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు**



**హైదరాబాద్, జూలై 10 :** ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. మాట తప్పడం, పార్టీలు మారడం రేవంత్‌రెడ్డి సంస్కృతి అని.. తనది కాదని విమర్శించారు. తమ ఇద్దరి రాజకీయ చరిత్రే దీనికి నిదర్శనమన్నారు. రేవంత్‌రెడ్డిలా ఒట్టు వేసి ఓ మాట.. వేయకుండా ఓ మాట చెప్పను. భద్రాద్రి రాముడి సాక్షిగా సంపూర్ణ రుణమాఫీ చేస్తానన్న హామీ ఏమైందని నిలదీసారు. రాష్ట్రం సంగతి పక్కన పెట్టండి.. కనీసం ఖమ్మం జిల్లాలోనైనా రుణమాఫీ చేశారా అని అన్నారు. ఎందుకంత ఆవేశం, అసహనంతో రగిలిపోతున్నారని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కన్నెపల్లి నుంచి నీళ్లు లిఫ్ట్ చేయలేని చేతగానితనాన్ని అబద్ధాలతో కవర్ చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై రాజకీయంగా పోరాడండి.. రైతులపై కక్ష తీర్చుకోవద్దన్నారు.. అన్నదాతల శాపం నుంచి ఈ ప్రభుత్వం తప్పించుకోలేదని హరీశ్‌రావు అన్నారు. గోదావరిలో నీరు ఎత్తిపోసి రైతులను ఆదుకోవాల్సింది పోయి, భద్రాచలం మునుగుతదిన ఎలా చెబుతారని అన్నారు. గతంలో లేని ముప్పు ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నారు.

## 15 నుంచి ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులు

**ఉద్యోగులతో భేటీలో సిఎస్ నిర్ణయం**

**హైదరాబాద్, జూలై 10 :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) హెల్త్ కార్డులను జులై 15 నుంచి అమల్లోకి తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో ఉద్యోగ సంఘాల ప్రతినిధులు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఈహెచ్‌ఎస్ అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఎంపిక చేసిన ఆస్పత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు పొందే అవకాశం కలగనుంది. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. మరోవైపు ఈహెచ్‌ఎస్ హెల్త్ కార్డులను త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా లాంఛనంగా పంపిణీ చేయనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి సంబంధించిన తేదీని ప్రభుత్వం త్వరలో ప్రకటించనుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు స్వాగతించారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యకు పరిష్కారం లభించిందని వారు పేర్కొన్నారు. హెల్త్ కార్డుల అమలుతో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు నాణ్యమైన వైద్య సేవలు మరింత సులభంగా అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సకలం చెరువు శిఖిలో ఫాతిమా కాలేజీ

(మొదటిపేజీ తరువాయి)

వేదికగా బండి సంజయ్ పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులకు వెంటనే కంటి పరీక్షలు చేయించాల్సిన అవసరం ఉందంటూ బండి సంజయ్ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కాంగ్రెస్ నేతల కోసం రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఆ పరీక్షల తర్వాత కూడా వారికి చెరువు పక్కన కళాశాల కనిపించకపోతే సమస్య కళ్లలో కాదు.. వారి రాజకీయాల్లోనే ఉందని అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. కాంగ్రెస్ ఎక్కడ రాజకీయ రంగోలి వేయాలనుకుంటే అక్కడ ఫుల్ ట్యాంక్ లెవల్ గీతలు వారి మిత్రులకు అనుకూలంగా మారిపోతున్నాయంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. అధికార పార్టీ తనకు అనుకూలంగా వ్యవస్థలను వినియోగిస్తోందని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాగా, సకలం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఒవైసీ కాలేజీ ఉందనే అంశంపై ఇటీవల రాజకీయంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా బండి సంజయ్ చేసిన పోస్టు.. తెలంగాణ రాజకీయాల్లో మరోసారి దుమారం రేపే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# గతంలో రైతుబంధు కోసం
# తిప్పించుకున్నారు

**పండించిన ప్రతి గింజను కొంటున్నాం**
**రైతు ఆశీర్వాద సభలో డిప్యూటీ సీఎం భట్టి**



**ఖమ్మం,జూలై10 :** తెలంగాణలోని రైతులకు పెట్టుబడి సాయం అందించే క్రమంలో ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. రైతు భరోసా పథకం కింద నూతనంగా రూ. 1,009 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేయగా, ఆ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. గత ప్రభుత్వం రైతు బంధు నిధుల కోసం 169 రోజులు తిప్పించుకునేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే రూ. 9 వేల కోట్లు ఇచ్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కొనియాడారు. ఇప్పటివరకు 74 లక్షల మంది రైతులకు, 1.45 కోట్ల ఎకరాల భూములకు గానూ మొత్తం రూ. 8,759 కోట్ల పెట్టుబడి సాయాన్ని అందించామన్నారు. అలాగే మహిళా సంక్షేమానికి కట్టుబడి కేవలం రెండున్నర ఏళ్లలోనే మహిళలకు రూ. 67,000 కోట్ల రుణాలను అందించామని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తూ రైతును రాజుగా చూస్తున్నామని భట్టి స్పష్టం చేశారు. మరోవైపు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్టులు ఒక్కటి కూడా దెబ్బతినలేదని, కానీ బీఆర్ఎస్ నాయకులు రూ. 27,000 కోట్లతో అయిపోయే ప్రాజెక్టును రూ. 1,47,000 కోట్లకు పెంచి, కట్టక కట్టక కట్టిన కాళేశ్వరాన్ని కూల్చేశారని మండిపడ్డారు. హరీష్ రావు అబద్ధాలన్నీ ప్రోగేసి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ చేసిన అప్పులు, వడ్డీలు కడుతూనే తాము ఉద్యోగుల బిల్లులు క్లియర్ చేస్తూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ నాయకుల భవిష్యత్తు అయిపోయిందని, వారు మళ్లీ మాయమాటలతో ఊళ్లలోకి వస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని, తరిమి తరిమి కొడతారని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

## నిర్ణీత గడువులోగా సర్ పక్రియ పూర్తి చేయాలి

**ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ**

**హైదరాబాద్,జూలై10 :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని భారత ఎన్నికల కమిషన్ సీనియర్ ఉప ఎన్నికల కమిషనర్ డా. పవన్ కుమార్ శర్మ సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న సర్ పక్రియపై పవన్ కుమార్ శర్మ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు(డిఇఓలు), ఓటరు జాబితా పరిశీలకులు పాల్గొన్నారు. సందర్భంగా పవన్ కుమార్ శర్మ మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజెషన్ పక్రియలను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో డిజిటలైజేషన్ పక్రియను మరింత వేగవంతం చేయాలని ప్రత్యేకంగా ఆదేశించారు. సర్ పక్రియలో అత్యుత్తమ పనితీరును కనబరిచిన జిల్లాల ఎన్నికల అధికారులతో కమిషన్ మాట్లాడి, వారు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను తెలుసుకుంది. ఆ వ్యూహాలను ఇతర జిల్లాలు కూడా అమలు చేసి, ఎన్యూమరేషన్ పక్రియను పూర్తి చేసి చేయాలని ఆదేశించారు. దనంగా, రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పక్రియలను ప్రతిరోజూ నిర్దేశరచిన లక్ష్యాల ప్రకారం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారికి భారత ఎన్నికల కమిషన్ ఆదేశించింది. దీంతో 2026 పక్రియను నిర్ణీత సమయంలో విజయవంతంగా పూర్తి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది.

## ఎవరో స్క్రిప్టు రాసిస్తే మాట్లాడే వ్యక్తిని కాదు : ఎంపీ ఈటల



**హైదరాబాద్, జూలై 10 :** కాళేశ్వరం అంశంలో తనపై కొందరు రకరకా లుగా మాట్లాడారని.. చిల్లర వ్యాఖ్యల పై స్పందించాల్సిన అవసరం లేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రాజకీ యాల ముసుగులో ప్రజల జీవితాలతో ఆడుకోవద్దని హితవు పలికారు. హైదరాబా ద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డారు. "ఎవరో ఆడిస్తేనో.. స్క్రిప్టు రాసిస్తేనో మాట్లాడే వ్యక్తిని కాదు. మేం స్వయం ప్రకాశకులం.. ఒకరు ఆడించి నట్లు ఆడే వ్యక్తులం కాదు. భాజపా ప్రాధాన్య అంశంగా కాళేశ్వరం సమస్య ను తీసుకున్నాం. ప్రాజెక్టులు, జల వివక్షపై ఉమ్మడి రాష్ట్రంలో కూడా పోరాడిన వ్యక్తిని నేను. ఎస్సారెస్పీ వచ్చాకే.. మా జిల్లాలో వ్యవసాయం పెరిగింది. కాళేశ్వరం కంటే ముందే.. అక్కడ జలయజ్ఞం జరిగింది. ఎస్సారెస్పీ గురించి అవగాహన ఉన్నవాళ్లకు అన్నీ తెలుస్తాయి. ఎల్‌నినో హెచ్చరికలు ఉన్నా.. ప్రభుత్వం అప్రమత్తం కాలేదు. రైతులకు నీళు ఇచ్చే బాధ్యత సీఎంపై ఉంది. అన్నారం, సుందిళ్ల వినియోగంపై విశ్రాంత ఇంజినీర్లతో చర్చించాలి" అని ఈటల రాజేందర్ అన్నారు.

## ఆయిల్ పామ్ సాగుతో కోతుల బెడద ఉండదు

- ప్రతి గ్రామంలో కనీసం వంద ఎకరాల్లో సాగు చేయాలి
- రైతులకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

**సిద్దిపేట,జూలై10 :** ఆయిల్ పామ్ డిమాండ్‌కి తగ్గ ఉత్పత్తి లేదని.. రైతులు ఆ సాగు వైపు మొగ్గు చూపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా కోతుల బెడద ఉండదని.. వాతావరణ మార్పుల ఇబ్బంది ఉండదని చెప్పుకొచ్చారు. నర్మెటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో 50 వేల ఎకరాలు ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. ఇప్పుడు 14 వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగు పెంచడానికి 5 ఎకరాలపైన ఉన్న రైతులతో సమావేశం ఏర్పాటు చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట మండలం జనగామ గ్రామంలో మెగా పామ్ ఆయిల్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి ఆయిల్ పామ్ మొక్కలు నాటారు. అనంతరం మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఒక్కో చిన్న గ్రామంలో 100 ఎకరాల ఆయిల్ పామ్ సాగు దాటిస్తే రూ.5 లక్షలు, పెద్ద గ్రామాల్లో 200 ఎకరాలపైన సాగు ప్రోత్సహిస్తే రూ.10 లక్షల అభివృద్ధి ప్రోత్సాహకాలు అందిస్తామని వెల్లడించారు. ఎల్‌నినో రాబోతోందని.. తీవ్ర కరవు కాటకాలు వర్షాభావ పరిస్థితులు ఉంటాయని మంత్రి తెలిపారు. దీంతో రైతులు ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం గురించి ఆలోచించే వారు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. దేశానికి ఆయిల్ పామ్ అత్యవసరమని మంత్రి వివేక్ వెంకట స్వామి అన్నారు. ఇరాన్ యుద్ధం వల్ల ధరలు పెరుగుతున్నాయని.. ఆయిల్ పామ్ దిగుమతి చేసుకుంటే ఇబ్బందులు తప్పవని.. అందుకోసం సొంతంగా ఉత్పత్తి పెంచాలని కోరారు. గత సంవత్సరం కాళేశ్వరం ప్రాజెక్ట్ లేనప్పటికీ 25 శాతం అదనంగా వడ్లు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ఆయిల్ పామ్‌కు పెద్దగా నీళ్లు అవసరం లేదన్నారు. చెన్నూరులో కూడా ఆయిల్ పామ్ సాగు వైపు చూస్తున్నారన్నారు '100 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసిన గ్రామాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ రూ.5 లక్షలు ప్రోత్సాహకం ఇస్తే.. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నేను కూడా రూ.5 లక్షలు ఇస్తాను' అని మంత్రి వివేక్ ప్రకటించారు.

## మధిరలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటు

**డిప్యూటీ సిఎం అభ్యర్థనతో సిఎం రేవంత్ అంగీకారం**

**ఖమ్మం,జూలై10 :** ఖమ్మం జిల్లా మధిరలో ఇంజనీరింగ్ కాలేజీ ఏర్పాటుకు సిఎం రేవంత్ రెడ్డి ఆమోదం తెలిపారు. డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క విజ్ఞప్తి మేరకు కాలేజీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా భట్టి కోర్కెను అభినందించారు. పేదలు చదువుకునేందుకు కోరిన చిన్న కోర్కెగా అభివర్ణించారు. చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి సభను ఉద్దేశించి ప్రసంగించారు. చివరలో భట్టి విక్రమార్క చేసిన విజ్ఞప్తి మేరకు కాలేజీ ఏర్పాటును అంగీకరించారు. ఈ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, వాకిటి శ్రీహరి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, రామసాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఇదే వేదిక నుంచి రతు భరోసా నిధుల విడుదలతో పాటు రైతులకు ఈ-పట్టాదార్ పాస్‌బుక్స్ జారీ చేసారు. 1.44 లక్షల మంది రైతుల ఖాతాల్లో 1009.15 కోట్లు జమ చేశారు. పెట్టుబడి సాయాన్ని అందించినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## రోడ్డు ప్రమాద ఘటనలో మరో ఇద్దరు కూలీల మృతి

**రాజన్న సిరిసిల్ల, జూలై 10 :** వేములవాడ మండలం అనుపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో ఇద్దరు మృతిచెందారు. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరు కూలీలు మరణించారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా పూణెళి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఉపాధి కోసం ఇటీవల తెలంగాణకు వచ్చారు. కరీంనగర్ జిల్లా బోయినపల్లి మండలంలోని జెగ్గారావుపల్లె వద్ద కొదు-రుపాకకు చెందిన కాంట్రాక్టర్ ద్వారా ఇక్కడ వరినాట్లకు కూలీలుగా వెళ్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం నాడు తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్‌లో వరి నాట్లు వేసేందుకు 17 మంది మహిళలు, ఆరుగురు పురుషులు వెళ్లారు. నాట్లు ముగించుకుని సాయంత్రం డ్రైవర్‌తో సహా మొత్తం 24 మంది టాటా ఏస్ వాహనంలో తిరుగు ప్రయాణమయ్యారు. వారు అనుపురం వద్దకు చేరుకోగానే వెనుక నుంచి ఆర్టీసీ అ÷-దదె వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటో దాదాపు పది అడుగుల దూరంలోకి ఎగిరిపడి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న వాసుదేవ్ (35) కూలీ అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్‌తో పాటు 23 మందదికి తీవ్ర గాయాలయ్యాయయి. వారిని హుటాహుటిన వేములవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఇందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉండగా.. అర్చన, రంజీ ప్రభాకర్ అనే ఇద్దరిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి మెరుగైన వైద్యం కోసం తరలించారు.

## దంపతుల మిస్సింగ్ కేసులో కొత్త కోణం

**అధిక వడ్డీ ఆశతో 50 కోట్లు ముంచినట్లు వెల్లడి**
**పలువురి ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

**హైదరాబాద్,జూలై10 :** హైదరాబాద్‌లోని చెర్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో స్విట్జర్లాండ్‌కు వెళ్లినట్లు చెప్పి అదృశ్యమైన దంపతుల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. తొలుత మిస్సింగ్ కేసుగా నమోదైన ఈ ఘటనలో తాజాగా భారీ ఆర్థిక మోసం ఆరోపణలు వెలుగులోకి రావడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. పబ్బా చంద్రశేఖర్ (51), ఆయన భార్య పబ్బా స్వప్న (42) జూన్ 22న స్విట్జర్లాండ్‌కు వెళ్తున్నట్లు కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరారు. అయితే ఆ తర్వాత జూలై 8 వరకు వారు కుటుంబ సభ్యులను ఫోన్ లేదా ఇతర మార్గాల్లో సంప్రదించలేదు. ఇద్దరి మొబైల్ ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్‌లో ఉండటంతో అనుమానం వ్యక్తం చేసిన వారి కుమార్తె పబ్బా శ్రేయ చెర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దంపతుల ఆచూకీ కోసం దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో తాజాగా మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వారం రోజుల క్రితమే పబ్బా చంద్రశేఖర్ దంపతులపై పలువురు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎక్కువ వడ్డీ ఇస్తామని, వివిధ పెట్టుబడి పథకాల పేరుతో డబ్బులు పెట్టిస్తామని చెప్పి సుమారు రూ.50 కోట్ల వరకు వసూలు చేసి మోసం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లో పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు సేకరించిన అనంతరం పబ్బా చంద్రశేఖర్ దంపతులు స్విట్జర్లాండ్‌కు వెళ్లి అక్కడే తలదాచుకున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మిస్సింగ్‌గా కనిపిస్తున్న ఈ ఘటన వెనుక ఆర్థిక నేరం కోణం కూడా ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దంపతులు నిజంగా స్విట్జర్లాండ్‌కు వెళ్లారా.? ప్రస్తుతం ఎక్కడ ఉన్నారు.? వారు దేశం విడిచి వెళ్లడానికి ముందు ఆర్థిక లావాదేవీలు ఎలా జరిగాయి.? అనే అంశాలపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. అలాగే మోసం ఆరోపణలపై వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలిస్తూ.. ఈ రెండు కేసుల మధ్య సంబంధం ఉందా అనే దిశగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు దంపతుల ప్రయాణ వివరాలు, బ్యాంకు లావాదేవీలు, బాధితుల ఫిర్యాదులు, విదేశీ ప్రయాణ రికార్డులను పరిశీలిస్తూ కేసును ఛేదించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం హైదరా బాద్‌లో సంచలనంగా మారింది.

# కన్నెపల్లి పంపు హౌస్ నుంచి
# నీటిని ఎత్తిపోయాలి

**ప్రాణహితలో నీళ్లు పారుతున్న కనిపించడం లేదా**
**ఎపికి సాయం చేసేందుకే రేవంత్ మిన్నకున్నారు**
**యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బిఆర్ఎస్ మహాధర్నా**



**యాదాద్రి భువనగిరి, జూలై 10 :** కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ మహాధర్నా చేపట్టింద. జిల్లా వ్యాప్తంగా భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు కలెక్టరేట్ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ అసమర్థ పాలన వల్లే రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. తక్షణమే నీటిని ఎత్తిపోసి రైతులను ఆదుకోవాలన్నారు. నిరసన కార్యక్రమలో మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద బిక్షమయ్య గౌడ్,జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి,రాష్ట్ర నాయకులు, చింతల వెంకటేశ్వర్లు, క్యామ మల్లేష్, కల్లూరి రామచంద్రారెడ్డి, ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కన్నెపల్లి నుంచి 93.5మీటర్ల నుంచి నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రాణహిత జలాలను ఎత్తిపోయకుండా దిగువకు వదిలిపెడుతున్నదని మండిపడ్డారు. సీజన్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు సుమారు 50టీఎంసీల జలాలను దిగువకు తరలిపోయినట్టు గణాంకాలే వెల్లడిస్తున్నాయన్నారు. ఇలాంటి సమయంలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించుకోవడమే అత్యంత ముఖ్యమని వారు అన్నారు. ఎత్తిపోయడానికి నీళ్లే లేవంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడిన గంటల్లోనే దిగువన.. పట్టిసీమ, తాడిపూడి పంపులను ఏపీ సర్కార్ ఆన్ చేసినా గుర్తించడం లేదా అని అన్నారు. తెలంగాణలో వానల్లేక పంటలు ఎండుతున్నా, మేడిగడ్డలో ప్రాణహిత వరద పారుతున్నా గోదావరి జలాలను ఎత్తిపోయడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతులురావడం లేదన్నారు. కానీ, అందివచ్చిన అవకాశంగా చంద్రబాబు సర్కార్ మాత్రం నీటిని లిఫ్ట్ చేయడం ప్రారంభించింది. ఆంధ్రాకు నీళ్లు పారించేందుకే ఇలా చేస్తున్నారన్న అనుమానాలు ఉన్నాయని అన్నారు. పట్టిసీమకు గోదావరిని పంపేందుకే ఇక్కడ పట్టించుకోవడం లేదా అని నిలదీసారు. రేవంత్ సర్కార్ తీరుతో ప్రాణహిత జలాలు తెలంగాణకు కాకుండా పోతున్నాయి. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోయకుండా దిగువకు వదిలిపెడుతున్నది. మొత్తంగా ఏపీ కోసమే రేవంత్ సర్కార్.. కన్నెపల్లి పంపులను ఆన్‌చేయడం లేదని వారు ఆరోపించారు.

## గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం

**టూవీలర్‌ను ఢీకొనడంతో యువతి మృతి**

**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ గచ్చిబౌలిలో వాటర్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అదుపు తప్పి రోడ్డుపై వెళ్తున్న యువతులను ఢీకొట్టడంతో పెద్ద ప్రమాదం జరిగింది. హాస్టల్ లో ఉంటూ ప్రైవేట్ జాబ్స్ చేస్తున్న యువతులలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. గచ్చిబౌలి ఫ్లై ఓవర్ వద్ద ఈ ఘోర ప్రమాదం జరిగింది . వాటర్ ట్యాంకర్ అదుపుతప్పి యాక్టివాపై వెళ్తున్న యువతులపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో గచ్చిబౌలిలోని హాస్టల్ లో ఉంటూ సేల్స్ గర్ల్‌గా పనిచేస్తున్న మల్లం భవాని(23) ఘటనాస్థలిలోనే చనిపో యింది. ఆమె స్నేహితురాలు సుభాషిని (30) తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. భవాని, ఆమె స్నేహితురులా సుభాషిని అంజయ్య నగర్ లోని హాస్టల్ లో ఉంటున్నారు. గచ్చిబౌలి ట్రిబుల్ ఐటీ నుండి అంజయ్య నగర్ కు యాక్టివ పై వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. వీరు ప్రయాణిస్తున్న యాక్టివా స్కూటీని వెనక నుంచి వేగంగా వాటర్ ట్యాంకర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన మల్లం భవాని అక్కడికక్కడే మృతి చెందగా సుభాషినికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. భవాని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాటర్ ట్యాంక్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. కేసు నమోదు చేసిన గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో బస్సు ఎత్తుకెళ్లిన తాగుబోతు

**టోల్‌గేట్ వద్ద అదుపుతప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొన్న బస్సు**

**జనగామ,జూలై10 :** జనగామ జిల్లాలో మద్యం మత్తులో ఓ వ్యక్తి చేసిన నిర్వాకం కలకలం రేపింది. జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో నిలిపి ఉంచిన అద్దె బస్సును ఎవరికి తెలియకుండా స్టార్ట్ చేసి తీసుకెళ్లాడు. సుమారు 21 కిలోమీటర్లు బస్సును నడిపించి చివరకు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ వాహనంలోనే తాళాలు వదిలేసి ఇంటికి వెళ్లాడు. ఇదే అవకాశంగా భావించిన పాలకుర్తి మండలం చెన్నూరుకు చెందిన డోజర్ డ్రైవర్ జిట్టబోయిన వెంకన్న మద్యం మత్తులో బస్సును స్టార్ట్ చేసి అక్కడి నుంచి సూర్యాపేట వైపు తీసుకెళ్లాడు. జనగామ నుంచి బస్సును నడిపిస్తూ వెళ్లిన వెంకన్న, దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపానికి చేరుకున్నాడు. అక్కడ బస్సు అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను ఢీకొట్టింది. ప్రమాదాన్ని గమనించిన టోల్‌గేట్ సిబ్బంది అనుమానంతో వెంటనే దేవరుప్పుల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న దేవరుప్పుల పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని నిందితుడు వెంకన్నను బస్సుతో సహా అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత అతడిని జనగామ పోలీసులకు అప్పగించారు. అద్దె బస్సు యజమాని గంట గోపికృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు జనగామ సీఐ సత్యనారాయణరెడ్డి కేసు నమోదు చేశారు. నిందితుడు మద్యం మత్తులోనే బస్సును ఎత్తుకెళ్లాడా.? ఘటనకు దారితీసిన పూర్తి పరిస్థితులు ఏంటనే అంశాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## డిపెండెంట్ ఉద్యోగాలపై పోరాటం ఆగదు

**20నుంచి చేపట్టబోయే దీక్ష యధాతథం**
**మణుగూరు పర్యటనలో కవిత స్పష్టీకరణ**

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 10 :** సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో పోరాటం సాగుతుందని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. 20వ తేదీ లోపు డిపెండెంట్ ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇస్తే దీక్ష విరమణ చేస్తామని చెప్పారు. ప్రభుత్వం హామీ ఇవ్వకుంటే గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష చేయనున్నట్లు కవిత ప్రకటించారు. శుక్రవారం ఆమె మణుగూరులో పర్యటించారు. రెండో విడత 'బాయిబాట' రెండో రోజు పర్యటనలో భాగంగా మణుగూరు సింగరేణి పీకే ఓసీపీ-2 ను సందర్శించారు. ఫస్ట్ షిఫ్ట్ కార్మికులతో మాట్లాడేందుకు కవిత ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం కవితను సింగరేణి అధికారులు అనుమతించడంతో కార్మికులతో మాట్లాడారు. ఈ నెల 20 తేదీన నిరవధిక నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ కోసం మెడికల్ బోర్డ్ ఏర్పాటు చేయాలని కవిత డిమాండ్ చేశారు. డిపెండెంట్ ఉద్యోగాలు సింగరేణి కార్మికుల హక్కు అని అన్నారు. అలియాస్ పేర్లు ఉన్న వారి నుంచి అఫిడవిట్లు తీసుకుని పేర్లు మార్చాలన్నారు. సింగరేణి బకాయిలు రూ.50 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో మూడు వేల ఉద్యోగాల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. నెలకు రెండు సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలన్నారు.



## కూలిన పాఠశాల గది పైకప్పు

**విద్యార్థులకు తప్పిన ముప్పు**

**నాగర్‌కర్నూలు, జూలై 10 :** ప్రభుత్వ పాఠశాల తరగతి గది పైకప్పు కూలిన ఘటన నాగర్ కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రమాదం నుంచి విద్యార్థులు త్రుటిలో తప్పించుకున్నారు. విద్యార్థులు తరగతిలో ఉండగా ఒక్కసారిగా గది పైకప్పు ముందు భాగం కూలింది. విద్యార్థులకు కొద్ది దూరంలో కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులు రోజులాగే ప్రార్థన అనంతరం తరగతి గదిలోకి వెళ్లిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. పాఠశాలలో 107 మంది విద్యార్థులకు గాను శుక్రవారం.. 70 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయుడు జనార్ధన్ తెలిపారు. వర్ష కాలం వస్తే పాఠశాల గదులు వర్షపు నీటితో నిండిపోతాయని, కొన్ని గదుల్లో పెచ్చులూడిపడి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. 70 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని చెప్పారు.

# ఎత్తిపోతల పంచాయితీ!



కాళేశ్వరంపై దాగుడు మూతలు కొనసాగుతున్నాయి. ఎవరిది నిజం అన్నది తెలడం లేదు. అధికార కాంగ్రెస్ కాళేశ్వరం పనికిరాదని, నీరు ఎత్తిపోయడానికి లేదని చెబుతోంది. చెరువులు కుంటలు నింపాలంటే ఎత్తిపోయాల్సిందే అని విపక్ష బిఆర్ఎస్ వాదిస్తోంది. సందట్లో సడేమియ్యాలా బిజెపి గోడవాటం వాదనలు చేస్తోంది. ఇందులో ఎవరు నిజం..ఎవరు అబద్దం అన్నది తేలాల్సి ఉంది. మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తి పోయడంలో ఉన్న ఇబ్బందులు, కష్టనష్టాలను నిపుణుల కమిటీ తేల్చాల్సి ఉంది. ఎందుకంటే ఎల్‌నినో ప్రభావంతో వర్షాల జాడ లేకుండా పోయింది. జలాశయాలు వట్టిపోయాయి.

ఎస్సారెస్పీ సహా గోదావరి బేసిన్‌లోని ప్రతి జలాశయం ఇప్పటికే డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. వానలు కురిసే అవకాశమూ తక్కువగానే ఉన్నది. ఎగువ నుంచి వరద వచ్చే ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ క్రమంలో కన్నెపల్లిలో పంప్‌లను ఆన్ చేసి నీటిని లిఫ్ట్ చేస్తే తద్వారా ఎల్లంపల్లి సహా మధ్యమానేరు, దిగువ మానేరు, అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మసాగర్, మల్కపేట తదితర రిజర్వాయర్లను నింపుకోవచ్చని బిఆర్ఎస్ వాదిస్తోంది. అదే విధంగా దేవాదుల నుంచి కూడా నీటిని ఎత్తిపోసుకొనే అవకాశమున్నా రేవంత్ సర్కార్ నీటిని లిఫ్ట్ చేయడం లేదని కూడా హరీస్ రావు అన్నారు. కేవలం ఎన్డీఎస్ఏ నివేదికలను సాకుగా చూపుతూ ప్రాణహిత జలాలను ఒడిసిపట్టకుండా దిగువకు వదిలిపెడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. కేవలం ఏపీలోని కృష్ణా డెల్టా కోసమే రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రాజెక్టులను పడావు పెడుతున్నారని ఆరోపించారు కూడా. అయితే ఇందులో నిజమెంత అన్నది తేలాల్సి ఉంది. దీనిని ఎవరు తేల్చాలన్నది ప్రజలకు తెలియదు. ప్రస్తుతం సర్కార్ వ్యవహరిస్తున్న తీరు సైతం అందుకు బలాన్ని చేకూర్చుతున్నది. ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కన్నెపల్లి, అన్నారం, సుందిళ్ల పంపింగ్ స్టేషన్ల నుంచి నీటిని ఎత్తిపోసే చర్యలు చేపట్టి, తద్వారా పంటలు.. రైతుల ప్రయోజనాలను కాపాడాలని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం డిమాండ్ చేసింది.

బరాజ్‌ల్లో మినిమమ్ డ్రా డౌన్ లెవల్ మేరకు జలాలను నిల్వ చేయవచ్చని, తద్వారా ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదని స్పష్టంచేసింది. అదీగాక ఎస్సారెస్పీ ఎగువన, దిగువన ఎల్లంపల్లి, సుందిళ్ల, అన్నారం వరకు వరదనే లేకుండా పోయింది. కానీ మేడిగడ్డ బరాజ్ వద్ద ప్రాణహిత నుంచి ప్రవాహం కొనసాగుతున్నది. మరోవైపు కన్నెపల్లి పంప్‌హౌస్‌లోని మోటర్ల ద్వారా రోజుకు 2 టీఎంసీలను ఎత్తిపోసుకొనే సామర్థ్యమున్నది. మరోవైపు ఏపీ ప్రభుత్వం ఎల్ నినో నేపథ్యంలో అప్పుడే ఎత్తిపోతలను ప్రారంభించింది. గోదావరిలో వస్తున్న వరదను ఉపయోగించుకుని కృష్ణా డెల్టాకు మళ్లిస్తున్నది. పోలవరం డ్యామ్ పూర్తయ్యే వరకు కుడికాలువ ద్వారా గోదావరి జలాలను తరలించేందుకుని ఏలూరు జిల్లాలో పట్టిసీమ లిఫ్ట్ స్కీమ్‌ను ఏపీ గతంలోనే చేపట్టింది. రోజుకు 8,500 క్యూసెక్కుల జలాలను గోదావరి నుంచి లిఫ్ట్ చేసి కుడికాలువ ద్వారా కృష్ణా డెల్టా ఆయకట్టుకు 80 టీఎంసీల మేరకు సాగునీటిని అందించడం ప్రధాన లక్ష్యం. అదేవిధంగా పోలవరం కుడికాలువకు సమాంతరంగా తాడిపూడి కెనాల్‌ను సైతం ఏపి నిర్మించింది. తాడిపూడి లిఫ్ట్ ద్వారా ఇక్కడా 1,400 క్యూసెక్కులను తరలించే ఏర్పాట్లు చేసింది. ఈ రెండు కాలువల ద్వారా గోదావరి జలాలను మళ్లిస్తున్నది. ప్రస్తుతం సూపర్ ఎల్ నినో నేపథ్యంలో పొరుగున ఏపీ ప్రభుత్వం పట్టిసీమ, తాడిపూడి లిఫ్ట్‌లను ప్రారంభించింది. సామర్థ్యం మేరకు గోదావరి జలాలను ఎత్తి పోసేందుకు సిద్ధమైంది.ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో వర్షాలు పడటం లేదని,మరోవైపు కేంద్ర జలసంఘం తాజా నివేదిక ప్రకారం రాష్ట్రంలోని పెద్ద ప్రాజెక్టులు, జలాశయాల్లో నీటి నిల్వలు సాధారణ స్థాయి కంటే సుమారు 16-46 శాతం తకువగా ఉన్నాయని వివరించారు. అదే సమయంలో రాష్ట్రంలో ప్రాణహిత నది మాత్రమే ఎల్లప్పుడూ ప్రవహించే నది. రాష్ట్రంలో నీరు లేని పరిస్థితిలోనూ ప్రాణహిత-గోదావరిలో వినియోగయోగ్య మైన వరద ప్రవాహాలు ఇప్పటికీ అందుబాటులో ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల ఈ మూడు లిఫ్టుల వ్యవస్థను సురక్షితంగా తిరిగి వినియోగించు కోవడం అత్యంత సమంజసమని అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ప్రాణహితలో వరద నీటిమట్టం మేడిగడ్డ ఎండీడీఎల్ కంటే ఎత్తుగా కొనసాగుతున్నంతకాలం, మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌స్టేషన్ నీటిని లిఫ్ట్ చేసి, అన్నారం, సుందిల్ల బరాజ్‌లను ఎండీడీఎల్ స్థాయిల వద్దే కొనసాగిస్తూ, నీటిని ఎల్లంపల్లి వరకు తరలించ వచ్చని, అది హైడ్రాలిక్‌పరంగా స్థిరమైన, నమ్మకమైన విధానమని విశ్రాంత ఇంజనీర్లు స్పష్టంచేశారు. గత వరద అనుభవాల ప్రకారం, సాంకేతిక నియమాలకు లోబడి, జాగ్రత్తతో, సురక్షిత పద్ధతుల్లో లిఫ్టులను నడిపితే గ్రామాల ముంపు, ఆస్తి నష్టం, ప్రాణనష్టం వంటి ప్రమాదాలు లేకుండానే నీటి పంపింగ్ వ్యవస్థను సఫలీకృతంగా వినియోగించుకోవచ్చని విశ్రాంత ఇంజనీర్లు చెబుతున్నారు. అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుత ఎల్ నినో సంక్షోభం నేపథ్యంలో పంటలు, రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా గోదావరిలో వచ్చే వరదనీటిని కాపాడుకోవాలి. అది ఎలా చేస్తారన్నది ఆలోచన చేయాలి. ప్రస్తుత దుర్భర పరిస్థితుల్లో సాగు,తాగునీటి అవసరాల కోసం అత్యవసర కార్యాచరణ సిద్ధం చేయాలి. అదికూడా యుద్ధప్రాతిపదిక సాగాలి. అప్పుడే మనకు నీటి కష్టాలు తీరుతాయి. పదేపదే విమర్శలతో కాలయాపన చేయడం కూడా మంచిది కాదు. ప్రజల, రైతుల ప్రయోజనం దృష్ట్యా కార్యరంగం లోకి దిగాల్సి ఉంది.

## దాడులు చేస్తున్నా కానరాని మార్పులు

**క్లౌడ్ కిచెన్ సెంటర్‌లో కాలం చెల్లిన పదార్థాలు**

**దాడుల్లో గుర్తించిన అధికారులు**

**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ క్లౌడ్ కిచెన్‌లో కుళ్ళిపోయిన, గడువు ముగిసిన పదార్థాలతో వంటలు చేస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో తేలింది. వరుస దాడులు చేస్తున్నా పరిస్థితుల్లో మార్పు కానరావడం లేదు. కొండాపూర్‌లోని 'రెబెల్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్' అనే క్లౌడ్ కిచెన్ సెంటర్ నుండి ఓవెన్ స్టోరీ, బెహ్రూజ్ బిర్యానీ, ఫాసోస్, స్వీట్ ట్రూత్, వెండీస్, లంచ్‌బాక్స్ వంటి చాలా బ్రాండ్ల పేర్లతో ఆన్‌లైన్‌లో ఫుడ్ డెలివరీ చేస్తున్నారు. అయితే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ బృందం ఇక్కడ తనిఖీలు చేసింది. గడువు ముగిసిపోయిన పెరుగు ప్యాకెట్ల ను, గ్రేవీని అధికారులు గుర్తించారు. ఈ పాడైపోయిన పెరుగుతోనే కస్టమర్ల కోసం మజ్జిగ తయారు చేస్తున్నట్లు కనిపెట్టారు. కిచెన్ పరిసరాల్లోని వాష్ రూమ్‌లు/స్నానాల ప్రదేశాలు చాలా అపరిశుభ్రంగా ఉన్నాయి. అక్కడ పనిచేసే సిబ్బందికి సంబంధించిన హెల్త్ సర్టిఫికెట్లలో మార్చినట్లు అధికారులు గుర్తించారు. అసలు మెడికల్ రిపోర్టులకు, వీరు చూపించిన సర్టిఫికెట్లకు అస్సలు సంబంధం లేదు. ఈ లోపాలు ఉన్న... అక్కడ కొన్ని మంచి పద్ధతులు కూడా కనిపించాయి. వంటల్లో కృత్రిమ రంగులు వాడకపోవడం, వంట చేసేవాళ్లు హెయిర్‌నెట్లు ధరించడం, నూనె నాణ్యతను పరీక్షించడం వంటివి బాగున్నాయి. దీంతో పరిశుభ్రత రేటింగ్‌లో ఈ అవుట్‌లెట్‌కు 100కి 78 మార్కులు వచ్చా యి. అధికారులు గడువు ముగిసిన వస్తువులన్నింటినీ అక్కడి కక్కడే పారవేయించారు. లోపాలన్నింటినీ తక్షణమే సరిదిద్దుకోవాలని యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్ల వ్యవహారంపై విడిగా విచారణ జరుపుతా మని చెప్పారు. సైబరాబాద్ వ్యాప్తంగా హోటళ్లు, క్లౌడ్ కిచెన్లు, ఇన్‌స్టామార్ట్ గోడౌన్లు, కాలేజీ మెస్‌లలో సీఎంసీ అధికారులు వరుస దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలో మరికొన్ని ఘోరాలు బయటపడ్డాయి. రెయిన్‌బో విస్టాస్ రెస్టారెంట్లో ఎలుకల రెట్టలు, కుళ్ళిపోయిన పుట్టగొడుగులు దొరికాయి. మాదాపూర్ శ్రీ చైతన్య, నారాయణ కాలేజీల సెంట్రల్ కిచెన్ పరిసరాల్లో పిల్లి మలం, వీధి కుక్కలు తిరుగుతూ కనిపించాయి. గజులరామారం ఇన్‌స్టామార్ట్ గోడౌన్లో ఎక్స్‌పైరీ అయిపోయిన చీజ్, పెరుగు నిల్వ ఉంచారు. కొంపల్లి రిలయన్స్ స్మార్ట్ బజార్లో గడువు ముగిసిన ప్యాకెట్లు, పురుగులు పట్టేసిన సరుకులు కనిపించాయి. చాలా చోట్ల ఆహార పదార్థాలు తయారుచేసే సిబ్బందికి కనీస వైద్య ధృవీకరణ పత్రాలు లేకపోవడం లేదా గడువు ముగిసిపోవడం వంటి తప్పులు పదే పదే జరుగుతున్నట్లు అధికారులు మండిపడ్డారు.

## సోషల్ మీడియా దుష్ప్రచారాలపై ఆందోళన

- ఏపీ కేబినెట్‌లో సీరియస్‌గా చర్చ
- పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన డిజిపి
- టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు సిఎం ఆదేశం



**అమరావతి, జూలై 10 :** సోషల్ మీడియా అంశంపై ఏపీ కేబినెట్‌లో సీరియస్‌గా చర్చ జరిగింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షత కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాపై డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా, నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం వెంటనే టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించింది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా కొత్తగా పీపీలను నియించు కోవాలని ఏపీ కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వంపై అభూత కల్పనలు, అసత్యాలు, అసలు విషయాలు వక్రీకరిస్తే మాత్రం ఉపేక్షించవద్దని మంత్రు గట్టిగా కోరినట్లు తెలుస్తోంది. ఈరోజు నుంచే సోషల్ మీడియాపై పోలీస్ యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాలని స్పష్టం చేసింది. ఇప్పటికే సోషల్ మీడియాపై ప్రభుత్వం నియమించిన కేబినెట్ సబ్ కమిటీలో కూడా చర్చించాలని ఆదేశించింది. వైసీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి దృష్టి మరల్చేందుకు కొత్త పద్ధతి ఎన్నుకున్నారని మంత్రులకు సీఎం చంద్రబాబు చెప్పారు. వారు కావాలని ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్నారని... వైసీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సూచించారు. వైసీపీ ట్రాప్‌లోకి లాగేందుకు చూస్తోందని.. జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతపురం సహా మిగతా జిల్లాలలో జరిగిన సంఘటనలను ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లిన సమయంలో ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇన్‌ఛార్జి మంత్రులు.. రెవెన్యూ, ఇతర సమస్యలపై కూడా ఫోకస్ పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

## ఇరాన్‌పై అమెరికా మిస్సైల్ దాడులు

**అణు కేంద్రం వద్ద పేలిన భవనం**



**టెహ్రాన్, జూలై 10 :** అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జూన్‌లో కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ముగియడంతో ఉద్రిక్తతలు మళ్లీ యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. గురువారం అమెరికా, ఇరాన్‌లు పరస్పరం దాడులు చేసుకున్నాయి. గురువారం తెల్లవారుజామున ఇరాన్‌లోని అణు విద్యుత్ కేంద్రం బుషెహర్ ప్లాంట్‌పై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. దీంతో అణు ప్లాంట్ ఆవరణలోని ఓ భవనం దెబ్బతింది. అమెరికా మిస్సైల్ దాడి చేసిన వెంటనే ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు వెంటనే స్పందించి ఎదురుదాడి చేశాయి. పరస్పర దాడుల కారణంగా ఆ ప్రాంతం మొత్తం పేలుళ్ల శబ్దాలతో హోరెత్తింది. ఇరాన్ అణు విద్యుత్ కేంద్రం ఉన్న 'బుషెహర్' ప్రాంతంతో పాటు చోగడక్, బందర్ అబ్బాస్, వ్యూహాత్మక ఓడరేవు ఉన్న కొనారక్ ప్రావిన్స్‌లలో భారీ పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. బుషెహర్ నగర శివార్లలోని మిలిటరీ ప్రధాన కార్యాలయంపై కూడా మిస్సైల్ దాడి జరిగింది. గడిచిన 48 గంటల్లో ఇరాన్ తీరప్రాంతాల్లోని దాదాపు 170కి పైగా సైనిక స్థావరాలపై అమెరికా సైన్యం దాడులు చేసింది. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకుంటున్న ఇరాన్‌ను దెబ్బతీసేందుకే ఈ చర్యలు ఈ దాడులు చేస్తున్నట్లు అమెరికా స్పష్టం చేసింది.

## తీరం వైపు దూసుకొస్తున్న తుఫాన్

**అప్రమత్తమైన చైనా ప్రభుత్వం**

**బీజింగ్, జూలై 10 :** చైనా వైపు మరో రక్కసి తుఫాను దూసుకొస్తోంది. తూర్పు తీరంవైపు బావి తుఫాను వస్తోందని అక్కడి వాతావరణ శాఖ పేర్కొంది. తుఫాను తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న రీత్యా వాతావరణ శాఖ గురువారమే ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. శనివారం తుఫాను మొదట తైవాన్‌ను తాకి అనంతరం చైనాలోని ఫుజియన్, జెజియాంగ్ ప్రావిన్సుల్లో తీరాన్ని తాకనుంది. ప్రభావిత ప్రావిన్సుల్లో 40 సెంటీమీటర్ల వరకూ వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. రక్కసి తుఫాను దూసుకొస్తున్న నేపథ్యంలో చైనా ప్రభుత్వం అప్రమత్తమైంది. తీరానికి సమీపంలోని 17 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. 1.70 లక్షల మంది విపత్తు నిర్వహణ సిబ్బందిని సిద్ధంగా ఉంచింది. తీర ప్రాంతాలతో పాటూ బీజింగ్ వరకూ తుఫాను ప్రభావం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నమే రాజధాని బీజింగ్‌లో అధికారులు ఎమర్జన్సీని ప్రకటించారు. స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. క్రీడా కార్యక్రమాలను వాయిదా వేశారు. ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు, గాలులతో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. తైవాన్‌లో కూడా హైఅలర్ట్ ప్రకటించారు. పలు ప్రాంతాల్లో ఇప్పటికే విమాన సర్వీసులు నిలిచిపోయాయి. హాంకాంగ్ ఎయిర్‌లైన్స్ పలు విమాన సర్వీసులను రద్దు చేసింది. గ్రేటర్ బే ఎయిర్‌లైన్స్ కూడా పలు విమాన సర్వీసులను నిలిపివేసింది. మిగిలిన విమానాలను దారి మళ్లించింది.

## ఒకే కాన్పులో నలుగురు పిల్లల జననం

**తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాల వెల్లడి**

**జయపుర, జూలై 10 :** రాజస్థాన్‌లోని ఝులావర్‌లో ఒక అరుదైన ఘటన చోటుచేసుకుంది. 25 ఏళ్ల ఓ మహిళ ఒకే ప్రసవంలో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. వారిలో ముగ్గురు ఆడపిల్లలు, ఒక మగబిడ్డ ఉన్నారు. శిశువులు నెలలు నిండకుండానే జన్మించడం, బరువు కూడా తక్కువగా ఉండటంతో వారిని ప్రస్తుతం నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి వైద్యులు ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. ఝులావర్ నగరంలోని భోయ్ మొహల్లా నివాసితులైన జ్యోతి కశ్యప్ (25), అరుణ్ కశ్యప్ దంపతులకు ఇప్పటికే ఒక సంతానం ఉంది. రెండో ప్రసవం కోసం ఆమె స్థానిక ప్రభుత్వ హీరా కున్వర్ బా మహిళా ఆసుపత్రిలో చేరారు. బుధవారం ఉదయం వైద్యులు ఆమెకు సిజేరియన్ నిర్వహించగా నలుగురు శిశువులు జన్మించారు. సుమారు 29 వారాలకే ప్రసవం జరగడంతో శిశువులు కేవలం 1.1 కిలోల నుంచి 1.2 కిలోల బరువు మాత్రమే ఉన్నారు. సాధారణంగా పూర్తి నెలలు నిండిన శిశువులు 2.5 కిలోల బరువు ఉంటారని, అయితే ఈ శిశువుల ఊపిరితిత్తులు పూర్తిగా అభివృద్ధి చెందకపోవడంతో వారికి శ్వాస అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు వెల్లడించారు. తన వృత్తి జీవితంలో ఒకే ప్రసవంలో నలుగురు శిశువులు జన్మించడం చూడటం ఇదే మొదటిసారని డాక్టర్ విశాల్ పేర్కొన్నారు. సాధారణంగా ప్రతి 24,000 ప్రసవాల్లో ఒకరికి మాత్రమే ఇలా జరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నా రు. ప్రస్తుతం తల్లి జ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆమెను గైనకాలజీ వార్డుకు తరలించినట్లు వైద్యులు తెలిపారు. శిశువుల్లో ఒకరి ఆరోగ్యం స్వల్పంగా మెరుగుపడగా మిగిలిన ముగ్గురి పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. ఈ పరిణామంపై తండ్రి అరుణ్ కశ్యప్ హర్షం వ్యక్తంచేశారు. తాను ఒక కుమార్తె పుడుతుందని ఆశించాను. కానీ దేవుడు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడిని ప్రసాదించాడు. దైవ నిర్ణయం ఏదైనా తమకు సంతోషమేనని ఆయన పేర్కొన్నారు.

## ఉత్తరాది రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు

**విరిగిపడిన కొండ చరియలు**

**ఉత్తరాఖండ్ :** ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌ల్లో కొండచరియలు విరిగిపడడంతో పలువురు మృతి చెందారు. దిల్లీలోని పలు ప్రాంతాల్లో 160 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సూరత్‌లో రహదారులు జలమయమవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శుక్రవారం ఉత్తరాఖండ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అలకనంద, మందాకిని నదులు ఉప్పొంగుతుండడంతో.. అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలోని పాఠశాలలను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో కురిసిన భారీ వర్షాలు జనజీవనాన్ని స్తంభింపజేశాయి. 75 రోడ్లు దెబ్బతిని రాకపోకలు నిలిచిపోయాయని.. 29 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ వెల్లడించింది.

## ఫిల్మ్‌నగర్‌లో నటుడి ఇంట్లోకి దూసుకొచ్చిన కారు

**మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేసిన యువకులు**

**హైదరాబాద్, జూలై 10 :** హైదరాబాద్ ఫిలింనగర్‌లో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. అతివేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి నేరుగా టాలీవుడ్ నటుడు ధర్మ నివాసంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి గేటు, ప్రహరీ గోడ ధ్వంసమయ్యాయి. అయితే ఇంట్లో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. కారులో ప్రయాణిస్తున్న యువకులు అతివేగంగా వాహనాన్ని నడపడంతో డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో కారు రోడ్డుపై నుంచి నేరుగా నటుడు ధర్మ ఇంటి ప్రాంగణంలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఘటన సమయంలో కారులో ఉన్న యువకులు మద్యం మత్తులో ఉన్నట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ధర్మ కుటుంబ సభ్యులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని కారులో ఉన్న యువకులను అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు.

## గురజాడ తొలి స్నాతకోత్సవం విశాఖలో తగదు

**విజయనగరంలోనే నిర్వహించాలని కోరిన బొత్స**

**అమరావతి, జూలై 10 :** ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ లేఖ రాశారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ గురజాడ-విజయనగరం తొలి స్నాతకోత్సవాన్ని విశాఖపట్నంలో నిర్వహించాలన్న నిర్ణయా న్ని పునఃపరిశీలించాలని బొత్స సత్యనారాయణ తన లేఖలో కోరారు.జేఎన్‌టీయూ గురజాడ తొలి స్నాతకోత్సవంపై బొత్స సత్యనారాయణ స్పందించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు బొత్స లేఖ రాశారు. ఈ లేఖలో బొత్స.. స్నాతకోత్సవానికి ఆహ్వానం అందించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపా రు. అయితే, విజయనగరం వంటి వెనుకబడిన జిల్లాలో విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవాన్ని అదే జిల్లాలో నిర్వహించడం సముచితమని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో కార్యక్రమం నిర్వహించడం వల్ల విజయనగరం జిల్లా ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరసనలు వ్యక్తమవుతున్నాయని లేఖలో తెలిపారు. ఈ నిర్ణయం వల్ల జిల్లా ప్రజల గౌరవం, ఆనందం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. విజయనగర ప్రజల అభిప్రాయాలను గౌరవించి, జేఎన్‌టీ యూ గురజాడ తొలి స్నాతకోత్సవాన్ని విజయనగరంలోనే నిర్వహించేలా నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని గవర్నర్‌ను కోరారు. విజయనగరం ప్రజల అసంతృప్తి, నిరసనలను ఈ లేఖ ద్వారా గవర్నర్ దృష్టికి తీసుకువస్తున్నట్టు బొత్స తెలిపారు.



## కరూరు బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

**విజయ్ ప్రభుత్వానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన హైకోర్టు**

**చెన్నై, జూలై 10 :** విజయ్ ప్రభుత్వానికి మద్రాస్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. కరూర్ తొక్కిసలాట బాధితుల కుటుంబాలకు ఉద్యోగ పత్రాల పంపిణీకి కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వ నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లవచ్చని కోర్టు స్పష్టం చేసింది. ఉద్యోగ నియామకాలు కేవలం 'తాత్కాలికం' మాత్రమేనని న్యాయస్థానం మెలిక పెట్టింది. భవిష్యత్తులో తుది తీర్పుకు లోబడి ఈ నియామకాలు ఉంటాయని స్పష్టం చేసింది. జస్టిస్ సీవీ కార్తికేయన్, జస్టిస్ ఆర్ శక్తివేల్‌లతో కూడిన హైకోర్టు ధర్మాసనం ఈ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిపింది. విచారణ సందర్భంగా ధర్మాసనం.. ప్రభుత్వం ఈ ఉద్యోగాలు ఇవ్వడానికి అనుసరించిన మార్గదర్శకాలు ఏమిటి?.. బాధితుల కుటుంబాలకు ఆ అర్హతలు ఉన్నాయా లేదా? అనే విషయాలపై పూర్తి వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎలాంటి స్పష్టమైన పాలసీ లేకుండా.. విపత్తు బాధితులకు ఉద్యోగాలు కేటాయించడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16 (సమానత్వ హక్కు) పరిధిలోకి వస్తుందో లేదో సమీక్షిస్తామని పేర్కొంది. కాగా, బాధితుల కుటుంబాలకు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం విజయ్ నియామక పత్రాలు అందజేయనున్నారు. అయితే, ఈ కేసును కోర్టు మళ్లీ విచారించే వరకు లబ్దిదారులకు మొదటి నెల జీతం చెల్లించకూడదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేసింది.



## గృహోపకరణాల యూనిట్ ఏర్పాటు చేయండి

**కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్**

**అమరావతి, జూలై 10 :** రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా ఏపీ మంత్రి నారా లోకేశ్ దక్షిణకొరియా పర్యటన ఆరోరోజు కొనసాగుతోంది. ఈ సందర్భంగా గృహోపకరణాలు, నీరు, గాలి శుద్ధి పరికరాల సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులతో మంత్రి భేటీ అయ్యారు. శ్రీసిటీలోని గృహోపకరణాల క్లస్టర్‌లో అంబర్, ఈప్యాక్ డ్యూరబుల్, డైకిన్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ మొదలైనవి సంస్థలు ఉన్నాయని లోకేశ్ తెలిపారు. దేశంలో 40శాతం ఏసీలు, 35శాతం టీవీలు ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతున్నాయన్నారు. ఇందుకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ అందుబాటులో ఉందని వివరించారు. ఇక్కడి నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడం సులభమన్నారు. దక్షిణ భారతదేశంలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రపంచ వాణిజ్యానికి భారతదేశం ఒక విశ్వసనీయ తయారీ భాగస్వామిగా ఉందని తెలిపారు. ఈ అనుకూలతల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసిటీలో లేదా తిరుపతిలో.. గృహోపకరణాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలు పరిశీలిస్తామని కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌వోడీ చెప్పారు. దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్, పాసివ్ కాంపొనెంట్స్ తయారీ సంస్థ మోటివ్ లింక్ సీఈవో కిమ్ కి-హాన్ , ఇంటర్నేషనల్ సేల్స్ అండ్ రీసెర్చ్ జనరల్ మేనేజర్ బైద్య శర్మతో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు.

## మరోమారు అధికార కోసం జగన్‌కు ఛాన్స్ లేదు

**అడిగితే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరు**

**కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కీలక వ్యాఖ్యలు**

**విశాఖపట్నం, జూలై 10 :** వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మావిగన్‌పై కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. మావిగన్ అంటే మామిడి పండు అని అనుకుంటున్నారని జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వచ్చే ఎన్నికల్లో ఇదే అంశంపై జగన్ వెళ్తారంటే అయ్యే పనికాదన్నారు. ఒకే ఒక్క ఛాన్స్ అని జగన్ అడిగితే ప్రజలు ఇచ్చారని.. ఇక ఆయనకు ఎటువంటి ఛాన్స్ ఇవ్వరని వ్యాఖ్యానించారు. జగన్ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని.. ఏదో ఊహించుకొని మాట్లాడుతున్నారని అన్నారు. జగన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు 11 ఉన్నాయని.. ఎన్నికల ముందు జైలుకు వెళ్తారా? లేదా? అనేది ముందు తెలుసుకోవాలని కేంద్రమాజీ మంత్రి హితవుపలికారు. జయలలితకు ఒక న్యాయం? జగన్‌కు ఒక న్యాయమా? అని ప్రశ్నించారు. 'జగన్ మావిగన్ అంటే నేను తిరుపతి అంటాను.. రాజధానిని రాయలసీమలో పెట్టమని అంటాను' అంటూ చింతా మోహన్ వ్యాఖ్యలు చేశారు.

## దేశద్రోహులకు వైసిపినేత జగన్ వత్తాసు

**రావణ్‌కు మద్దతుపై మండిపడ్డ ఎంపి కలిశెట్టి**

**అమరావతి, జూలై 10 :** దేశద్రోహానికి పాల్పడిన రావణ్‌కు ఏ విధంగా మద్దతు ఇస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశద్రోహ శక్తుల తరఫున వాదనలు వినిపించడంపై ప్రజలకు జవాబు చెప్పాలని వైసీపీ నేత సుధాకర్ రెడ్డికి స్పష్టం చేశారు. రాజ్యాంగం, చట్టం, దేవతలపై కనీస గౌరవం లేకుండా మాట్లాడే వారిని వైసీపీ సమర్థించడం సభ్యసమాజం తలదించుకునే చర్యగా ఆయన అభివర్ణించారు. కులాల, ప్రాంతాల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించి సమాజాన్ని ఇబ్బంది పెట్టేలా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సోషల్ మీడియా యాక్టివిస్టులకు నెలనెలా ముడుపులిచ్చి, ప్రజాప్రభుత్వంపై బురదజల్లేలా సంఘ విద్రోహ శక్తులను తయారు చేస్తున్నారంటూ వైసీపీ నేతలను విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ 'యజ్ఞాన్ని' భగ్నం చేసేందుకు వారు రాక్షసుల్లా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని విధ్వంసానికి ఎ÷-లాన్ గీసి, తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయని సాక్షాత్తు ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా గారే ప్రశంసించారని ఈ సందర్భంగా విజయనగరం ఎంపీ గుర్తు చేశారు. ఇంకా అధికారంలో ఉన్నామనే భ్రమతో పోలీసు అధికారులను ఫోన్లలో బెదిరిస్తూ వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారని వైసీపీ నేతల తీరును ఎండగట్టారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చి పులివెందుల ఎమ్మెల్యేగా గెలిపిస్తే.. అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలపై చర్చించకుండా, కేవలం విధ్వంసం సృష్టించడమే ధ్యేయంగా పెట్టుకున్నారంటూ వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై నిప్పులు చెరిగారు. ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా, జగన్‌కు గవర్నర్ బంగ్లా కావాలంటూ అధికార దాహం ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తారని చెప్పారు. వైసీపీని జీరో చేసి జగన్ నోరు నొక్కడం ఖాయం అని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు జోస్యం చెప్పారు.

## ఖాతాదారులకు ఆల్మైటీ జెనిసెసం సంస్థ మోసం

**డైరెక్టర్లు అరెస్ట్ చేసిన పోలీసులు**

**కాకినాడ, జూలై 10 :** అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి ఖాతాదారులను మోసం చేసిన కాకినాడకు చెందిన ఆల్మైటీ జెనిసెస్ సంస్థ డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో సంస్థ డైరెక్టర్లు మోజేష్, లలితాంబికను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15 వేల చొప్పున చెల్లిస్తామని మాయమాటలు చెప్పి సంస్థ భారీగా డిపాజిట్లు సేకరించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.48 కోట్ల మేర ప్రజల నుంచి వసూలు చేసినట్లు విచారణలో తేలింది. కొన్ని నెలలుగా పెట్టుబడిదారులకు చెల్లింపులు నిలిపివేయడంతో కాకినాడలోని ఆల్మైటీ జెనిసెస్ కార్యాలయం వద్ద బాధితులు ఆందోళన చేపట్టారు. ఆరుగురు ఖాతాదారులు సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా సంస్థ డైరెక్టర్లు మోజేష్, లలితాంబికను అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన సంస్థ డైరెక్టర్లను కోర్టులో హాజరుపర్చనున్నారు.

# సమాజానికి నష్టం కలిగించేలా

# సోషల్ మీడియా రోగం

**అసత్యాలతో రాజకీయ బురదజల్లుతున్న ప్రచారం**

**ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చే ఆలోచన**

**ప్రపంచ వ్యాప్తంగా కఠిన చర్యలు అమలుపై అధ్యయనం**

**కేబినేట్ నిర్ణయాలను వివరించిన మంత్రి పారథసారథి**




**అమరావతి, జూలై 10 :** సోషల్ మీడియా వల్ల సమాజానికి ఉపయోగంతో పాటు తీవ్ర నష్టం కలిగించే 'రోగంగా' మారుతోందని ఎపి కేబినెట్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు కేబినేట్ వివరాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కె. పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంతో ప్రజల ఆలోచనా విధానం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని కేబినెట్‌లో చర్చ జరిగిందని చెప్పారు. శుక్రవారం వెలగపూడిలోని సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం వివరాలను మంత్రి పార్థసారథి విలేకర్ల సమావేశంలో వివరించారు. విద్వేష ప్రచారం, వ్యక్తిత్వ హననం చేసే సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ సమకూర్చాలని ఈ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై అన్ని ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సీఎం సూచించారని పేర్కొన్నారు. సైబర్ ఇన్వెస్టిగేషన్‌లో నైపుణ్యం కలిగిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను అవసరమైతే నియమించాలని సీఎం చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారని చెప్పారు. ప్రపంచంలోని అనేక దేశాలు సోషల్ మీడియా నియంత్రణకు కఠిన చట్టాలు అమలు చేస్తున్నాయన్న అంశంపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రజెంటేషన్ ఇచ్చారని అన్నారు. సంప్రదాయ మీడియాకు ఉన్న జవాబుదారీతనం, నైతిక విలువలు సోషల్ మీడియాలో కనిపించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం, అసత్య సమాచారం పెరుగుతోందని ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాను రాజకీయ ప్రత్యర్థులపై దాడులు, అసత్య ప్రచారం కోసం కొందరు దుర్వినియోగం చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇటువంటి కార్యకలాపాలకు కొన్ని రాజకీయ పార్టీలు కూడా ఆర్థిక సహకారం అందిస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై డీజీపీ, పోలీసు అధికారులు క్యాబినెట్‌కు సమగ్ర నివేదిక సమర్పించారని పేర్కొన్నారు. విదేశాల్లో అమలులో ఉన్న సోషల్ మీడియా చట్టాలు, భారత ఐటీ చట్టంలోని లోపాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించినట్లు వివరించారు. మహిళలను, బాలికలను కించపరిచే పోస్టులు, వ్యక్తిత్వ హననం, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాన్ని ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారని తెలిపారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై చట్టాలను మరింత బలోపేతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారని చెప్పారు. రాష్ట్ర స్థాయి సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ ఏర్పాటు చేయాలని ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. సోషల్ మీడియా దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. సోషల్ మీడియా దుర్వినియోగ నియంత్రణపై దేశ, విదేశాల్లో అమలులో ఉన్న ఉత్తమ విధానాలపై గ్రూప్ ఆఫ్ మినిష్టర్స్ (జీఓఎం) అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీల ధర్నా

**కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ సకర్యాలపై పోరుబాట**

**విజయవాడ, జూలై 10 :** రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీసవేతనం రూ. 26 వేలతో పాటు పెన్షన్, వైద్యసదు-పాయం కల్పించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళనకు దిగారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌ల వద్ద నిరసనలు చేపట్టారు. విశాఖ జగదాంబ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేపట్టారు. కర్నూలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు ప్రకటించిన విధంగా జీతాన్ని వెంటనే పెంచి కార్యకర్తలపై రాజకీయ వేధింపులను ఆపాలని కోరారు. ప్రస్తుతం వాడుతున్న నవచేతన యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తిరుపతిలో జిల్లా కలెక్టరేట్ ఎదుట అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరసన చేపట్టారు. సీ.ఐ.టీ.యు నేత కందారపు మురళి నేతృత్వంలో తిరుపతి జిల్లా కలెక్టరేట్ ఎదుట వేలాది మంది అంగన్వాడి వర్కర్లు తో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. అంగన్వాడి వర్కర్ లకు ఈ.ఎస్.ఐ, పి.ఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. సంక్షేమ పథకాలు అంగన్వాడి వర్కర్ లకు అందించాలన్నారు. కాగా ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు పెన్షన్, పిఎఫ్ ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరుతూ అంగన్వాడీ కార్యకర్తలు ఈ రోజు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టారు. పేద గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వం-ర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు సేవలందిస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని ఆవేదన



వ్యక్తం చేస్తూ నిరసనలకు పిలుపిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 55,607 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 48,770 మినీ కేంద్రాలు ఉన్నాయి. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అంగన్‌వాడీలకు రూ.26 వేల కనీస వేతనం, ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్ వాడీల వేతనాలను పీఆర్సీకి అనుసంధానం చేయడంతో పాటు, గుజరాత్ హైకోర్టు తీర్పునకు అనుగుణంగా జీతాలు పెంచాలన్నారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. హెల్పర్ల ప్రమోషన్‌కు 5 ఏళ్ల సీనియారిటీ నిబంధనను రద్దు చేయాలని అన్నారు. అంగన్‌వాడీలకు 'తల్లికి వందనం' సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. సిగ్నల్ సమస్యలతో తీవ్ర ఇబ్బంది పెడుతున్న ముఖ గుర్తింపు ఫేస్ యాప్‌ను, పనిభారం పెంచే నవచేతన యాప్‌ను తక్షణమే రద్దు చేయాలి. పెండింగ్‌లో ఉన్న టీఏ, మెయింటినెన్స్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

## వైఎస్ అధికారాన్ని అడ్డుపెట్టుకుని క్విడ్‌ప్రోకో

- సొంత పత్రికుల, ఛానల్‌లకు నిధుల మళ్లింపు
- బ్రాహ్మణి స్టీల్‌కు భూకేటాయింపుల్లో జగన్ హస్తం
- జగన్ తీరుపై మండిపడ్డ కొమ్మారెడ్డి పట్టాభి

**అమరావతి, జూలై 10 :** బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో రాయలసీమ యువతకు ఉపాధి ఇస్తాననే భ్రమ కల్పించి భారీ దోపిడీ చేశారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. బ్రాహ్మణి స్టీల్స్‌కు 14 వేల ఎకరాల ప్రజల సొత్తు, ప్రభుత్వ భూమిని కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. కేటాయించిన భూములను రూ.350 కోట్లకు తాకట్టు పెట్టి భారీ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. ఈ మేరకు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని పరిశ్రమలకు భూ కేటాయింపుల పేరుతో క్విడ్ ప్రోకో ద్వారా జగన్ కోట్లు దండుకున్నారని ఆరోపించారు. రెడ్ గోల్డ్ ఎంటర్‌ప్రైజెస్, ఆర్ఆర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జగతి పబ్లికేషన్స్‌కు రూ.44 కోట్లు, ఇందిరా టెలివిజన్‌కు రూ.30 కోట్లు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని పట్టాభి ప్రశ్నించారు. కోట్లు దండుకున్నా బ్రాహ్మణి స్టీల్స్‌లో ఒక్క ఇటుక కూడా పేర్చలేదన్నారు. 2007 జూన్ 10న బ్రాహ్మణి స్టీల్స్ శంకుస్థాపన కార్యక్రమాన్ని జగన్ స్వయంగా నడిపించారని గుర్తుచేశారు. ఓబులాపురం గనుల్లో భారీ అక్రమాలు జరిగాయని సీబీఐ స్పష్టం చేసిందని.. అయినా 2022 ఆగస్టులో ఓబులాపురం గనులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. జగన్ లూటీకి గురైన 14 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని పట్టాభి వివరించారు. నాడు పరిశ్రమల పేరుతో జగన్ లూటీ చేస్తే.. నేడు పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి విప్లవాన్ని తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వమని తెలిపారు. కియాతో ప్రారంభమైన పారిశ్రామిక ప్రగతి.. నేడు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిట్టల్ వంటి గ్లోబల్ సంస్థల పెట్టుబడులతో కొనసాగుతోం దన్నారు. లూటీకి ప్రతీక జగన్ అయితే.. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలకు ప్రతీక చంద్రబాబు అని కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు.



## జడ శ్రావణ్‌కు అంత డబ్బెలా వచ్చింది?

**మంత్రి కందుల దుర్గేశ్**

**అమరావతి:** యూట్యూబర్ బచ్చులకూరి జోసెఫ్ అలియాస్ రావణ్ వెనుక వైకాపా ఉందని ఏపీ మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. జోసెఫ్ స్నేహితుడు గగన్ ఇవాళ వైకాపా అధ్యక్షుడు జగన్‌ను కలిశారని చెప్పారు. రావణ్‌కు సాయం చేయాలని వైకాపా నేత దేవినేని అవినాశ్‌కు జగన్ సూచించారన్నారు. జడ శ్రావణ్‌కుమార్ వెనుక కూడా ఆ పార్టీ ఉందన్నారు. "క్రైస్తవులను రెచ్చగొట్టి మతకలహాలు సృష్టించాలని వీరంతా చూస్తున్నారు. ఏలూరు సభలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడారు. హిందూ దేవుళ్లను కించపరిచేలా జోసెఫ్ మాట్లాడాడు. నాస్తికులైతే ఏ దేవుడినీ నమ్మరు.. కానీ కొందరినే నమ్ముతానని అతడు అన్నాడు. తాడేపల్లి ప్యాలెస్ నుంచి కుట్ర జరుగుతోంది. రూ.25 కోట్లు ఖర్చు పెట్టానన్న జడ శ్రావణ్‌కు అంత డబ్బెలా వచ్చింది? జోసెఫ్, ప్రకాశ్‌రాజ్, జడ శ్రావణ్‌కు వైకాపా నుంచి సాయం అందుతోంది. కూటమి బంధాన్ని దెబ్బతీయడమే వారందరి లక్ష్యం" అని కందుల దుర్గేశ్ అన్నారు.

### హీరో అవకాశం ఇస్తామంటూ

## మూడున్నర కోట్లు వసూలు

**పిల్ల జమీందార్ నిర్మాత దర్శకులపై కేసు నమోదు**

**హైదరాబాద్, జూలై 10 :** తెలుగు సినిమా రంగంలో హీరోగా ఎంట్రీ ఇప్పిస్తామంటూ భారీ మోసానికి పాల్పడిన వ్యవహారంలో టాలీవుడ్ హిట్ చిత్రం 'పిల్ల జమిందార్' దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబు, నిర్మాత విజయలక్ష్మిలపై సైబరాబాద్ పోలీస్ పరిధిలో కేసు నమోదైంది. బాధితుల కథనం ప్రకారం.. ఒక యువకుడిని టాలీవుడ్‌లో హీరోగా పరిచయం చేస్తామంటూ నమ్మించిన దర్శకుడు అశోక్ బాబు, సదరు యువకుడి తల్లిదండ్రుల నుండి విడతల వారీగా దాదాపు రూ.3.5 కోట్ల రూపాయలు వసూలు చేశారు. అయితే, డబ్బులు తీసుకుని చాలా కాలం గడుస్తున్నా సినిమా ఊసే ఎత్తకపోగా, యువకుడిని హీరోగా లాంచ్ చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. దీనితో మోసపోయామని గ్రహించిన బాధితులు తమ డబ్బులను తిరిగి ఇవ్వాల్సిందిగా నిలదీశారు. తీసుకున్న భారీ మొత్తాన్ని తిరిగి ఇచ్చేందుకు కూడా నిరాకరించడంతో, బాధితులు న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగానికి చెందిన పోలీసులు దర్శకుడు గుడ్లూరి అశోక్ బాబుతో పాటు నిర్మాత విజయలక్ష్మిపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం వీరిద్దరిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. టాలీవుడ్‌లో ఈ తరహా మోసం బయటపడటం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో తీవ్ర సంచలనంగా మారింది.

## గ్రామాల్లో రూ.9,355 కోట్లతో తాగునీటి పథకాలు

- 10 భారీ మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్‌ల ఏర్పాటు
- నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లు
- 2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు
- పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణ
- కేబినేట్ భేటీలో 30కి పైగా అంశాలకు కేబినేట్ ఆమోదం

**అమరావతి, జూలై 10 :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన అమరావతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా కీలక అజెండా అంశాలకు ఆమోదం లభించింది. వాటిలో ముఖ్యంగా.. మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ చేపట్టాలని నిర్ణయించారు. గ్రామాల్లో రూ.9,355 కోట్లతో 10 భారీ మల్టీ విలేజ్ తాగునీటి పథకాల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల కోసం రూ.1,811 కోట్లతో 2,943 తాగునీటి పథకాలకు అనుమతులు మంజూరు చేశారు. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునికీకరణతో పాటు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్ పనులకు కేబినెట్ ఆమోదం లభించింది. భూసమీకరణ నిర్ణయాలు.. అమరావతిలో రెండో విడత కింద భూములిచ్చే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు సాగు రుణమాఫీ చేయాలని నిర్ణయించారు. 2026 జనవరి 6 కంటే ముందు తీసుకున్న రుణాలకు మాత్రమే ఈ మాఫీ వర్తిస్తుంది. భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు ఏటా మెట్ట భూములకు రూ.3 వేలు, జరీబు భూములకు రూ.5 వేల చొప్పున కౌలు పెంచే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీనితో మొత్తం కౌలు మెట్ట రైతులకు రూ.40 వేలకు, జరీబు రైతులకు రూ.60 వేలకు చేరనుంది. రెండో విడత భూసమీకరణ పరిధిలోని 307 ఎకరాల ఇనాం భూములకు గానూ దేవదాయశాఖకు రూ.159 కోట్ల పరిహారం చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. సీఆర్డీఏ ఆమోదించిన సంస్థలకు, ఎన్ఎఫ్‌డీబీ భారీ అక్వేరియం-కార్యాలయానికి, అలాగే ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ సంస్థలకు భూకేటాయింపులు జరపనున్నారు. నెల్లూరులో ఐటిసి హోటల్, కడపలో మాధవి హోటల్, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలను ఆమోదించారు. కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్మెంట్ పార్కు ఏర్పాటుకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కొత్త పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో భారీ కాన్సర్ట్ (సంగీత/సాంస్కృతిక ప్రదర్శనలు)ల నిర్వహణకు ప్రత్యేక విధానాన్ని ప్రతిపాదించారు. పర్యాటక ప్రచారానికి రూ.50 కోట్లు కేటాయించారు. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చించారు. విశాఖపట్నం, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో 'అంబేడ్కర్ గురుకుల సీవోఈ ' ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. విద్యార్థులకు ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల కొరకు రెసిడెన్షియల్ కోచింగ్ ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఓకే చెప్పింది. విశాఖపట్నంలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు ఆమోదం లభించింది.

# భారీ లాభాలతో ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలకు తోడు ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు వరుసగా రెండో రోజూ రాణించాయి. దీంతో బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే దాదాపు రూ.6 లక్షల కోట్లు పెరిగి రూ.482 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 77,395.63 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,741.82) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 77,642.23 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 827.57 పాయింట్ల లాభంతో 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 244.10 పాయింట్ల లాభంతో 24,206.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.31గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో రిలయన్స్, టెక్ మహీంద్రా, బీఈఎల్, యాక్సిస్ బ్యాంక్, టాటా స్టీల్ షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ట్రెంట్, ఐటీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.17 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్సు 4,108 డాలర్ల వద్ద కొనసాగుతోంది. షాంఘై మినహా ఆసియా మార్కెట్లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో ట్రేడింగ్‌ను ఆరంభించాయి.






## టీమిండియాపై బీసీసీఐ సీరియస్..

ఇంగ్లండ్ పర్యటనలో వరుసగా మూడు టీ20 మ్యాచ్‌ల్లో ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో భారత క్రికెట్ జట్టు కోచింగ్ స్టాఫ్‌పై వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. టీ20 సిరీస్‌లో జట్టు కనబరిచిన నిరాశాజనక ప్రదర్శనపై బీసీసీఐ కోచింగ్ స్టాఫ్, ఆటగాళ్ల ప్రదర్శనను నిశితంగా సమీక్షించనుంది. నిజానికి ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కాంట్రాక్ట్ 2027 వరకు ఉన్నప్పటికీ, జట్టు ఇటీవలి పేలవమైన ఆటతీరుతో ఆయన పదవికే ముప్పు పొంచి ఉందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో టీమిండియా బ్యాక్-టు-బ్యాక్ రెండు టీ20 సిరీస్‌లను కోల్పోయింది. మొదట ఐర్లాండ్ చేతిలో 2-0తో వైట్‌వాష్ అయిన భారత జట్టు, ఇప్పుడు ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లోనూ 3-0తో వెనుకబడి సిరీస్‌ను చేజార్చుకుంది. భారత్-ఇంగ్లండ్ మధ్య ఇప్పటివరకు నాలుగు మ్యాచ్‌లు జరగ్గా.. అందులో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. ఇంగ్లండ్ పర్యటనలో మేనేజ్‌మెంట్ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాల వల్లే బీసీసీఐ ఈ సమీక్షకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్‌ను జట్టు నుండి తప్పించడంపై మేనేజ్‌మెంట్‌పై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఇంగ్లండ్‌తో జరిగిన మొదటి టీ20 తర్వాత శాంసన్‌ను పక్కన పెట్టారు. అతని స్థానంలో వైభవ్ సూర్యవంశీని ఓపెనర్‌గా బరిలోకి దించినప్పటికీ, అతడు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మరోవైపు ఇషాన్ కిషన్, తిలక్ వర్మల ఫామ్ కూడా టీమిండియాకు పెద్ద తలనొప్పిగా మారింది. ఐర్లాండ్ సిరీస్‌తో కలుపుకొని ఈ మొత్తం పర్యటనలో తిలక్ వర్మ బ్యాటింగ్‌లో ఘోరంగా విఫలమయ్యాడు. అయితే, వరుసగా ఫెయిల్ అవుతున్నప్పటికీ కేవలం వైస్ కెప్టెన్ (ఉప-కెప్టెన్) అనే ఒకే ఒక్క కారణంతోనే తిలక్ వర్మను జట్టు నుండి తప్పించడం లేదా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇక ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేయర్‌గా ఉన్న ఇషాన్ కిషన్ సైతం ఇంగ్లండ్‌లోని పిచ్‌ల స్వింగ్, బౌన్స్‌ను తట్టుకోలేక పరుగులు చేయడానికి తీవ్రంగా శ్రమిస్తున్నాడు.



## బిగ్ బాష్ లీగ్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న చెన్నై నగరం

ఈ ఏడాది డిసెంబర్‌లో ప్రారంభం కానున్న బిగ్ బాష్ లీగ్ (2026-27 సీజన్) ప్రారంభ మ్యాచ్‌కు భారతదేశంలోని చెన్నై నగరం ఆతిథ్యం ఇవ్వనుంది. తద్వారా భారత్‌లో ఒక మ్యాచ్‌ను నిర్వహించబోతున్న తొలి విదేశీ క్రికెట్ లీగ్‌గా బిగ్ బాష్ లీగ్ రికార్డు నెలకొల్పనుంది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో కలిసి మెల్బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం ఈ చరిత్రాత్మక ప్రకటనను అధికారికంగా వెల్లడించారు. డిసెంబర్ 12న చెన్నైలోని ఐకానిక్ 'ఎమ్ఏ చిదంబరం స్టేడియం' (చేపాక్) లో జరిగే ఈ ఓపెనింగ్ మ్యాచ్‌లో మెల్బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కార్చర్స్ జట్లు తలపడనున్నాయి. డిసెంబర్ నెలలో భారతదేశం అంతటా జరగనున్న వారం రోజుల పాటు సాగే ఆస్ట్రేలియా సాంస్కృతిక, వ్యాపార, క్రీడా ఉత్సవం 'జీ డే నమస్తే'లో ఈ బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ ఒక ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య క్రీడలు, సాంకేతికత, పెట్టుబడులను పెంపొందించేందుకు కుదిరిన 'సహకార రోడ్‌మ్యాప్' లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. "భారతదేశం అంతటా, ముఖ్యంగా చెన్నైలో అద్భుతమైన క్రికెట్ ప్రేమికులు ఉన్నారు. చేపాక్ స్టేడియంలో మ్యాచ్‌కు భారీ సంఖ్యలో ప్రేక్షకులు వస్తారని మేము ఆశిస్తున్నాము" అని బిగ్ బాష్ లీగ్ ఎగ్జిక్యూటివ్ జనరల్ మేనేజర్ అలిస్టర్ డోబ్సన్ సంతోషం వ్యక్తం చేశారు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌కి ఉన్న క్రేజ్ దృష్ట్యా.. ఈ మ్యాచ్‌లో కూడా స్టాండ్స్ అంతా పసుపు రంగు జెండాలతో నిండిపోయే అవకాశం ఉందని ఆయన చమత్కరించారు.

# చెలరేగిన అభిరథ్..

## ఫైనల్‌కు దూసుకెళ్లిన 'ఈ' ఛాంపియన్స్



**హైదరాబాద్ :** టీజీ20లీగ్‌లో హైదరాబాద్ 'ఈ' ఛాంపియన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. కరీంనగర్ డైమండ్స్‌తో జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో విజయ దుందుభి మోగించింది. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. 158 పరుగుల లక్ష్యాన్ని కేవలం 15.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ అభిరథ్ రెడ్డి (82; 49 బంతుల్లో 7x4, 5x6) చెలరేగాడు. వికాస్‌రెడ్డి (45; 31 బంతుల్లో 3x4, 3x6) అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కరీంనగర్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. సింహా (38),శుభం శర్మ (31),సాత్విక్ రెడ్డి (28), రాహుల్ రాధేశ్ (28) రాణించారు. ఈ ఛాంపియన్స్ బౌలర్లలో అజయ్ దేవ్ గౌడ్, షణ్ముఖ అశ్విన్, ప్రణవ్ వర్మ తలో 2 వికెట్లు పడగొట్టగా.. అఖిల్ రాథోడ్ ఒక వికెట్ తీశాడు. లక్ష్య ఛేదనకు దిగిన హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ ప్రారంభం నుంచే కసి తీరా ఆడింది. వరుస ఫోర్లు, సిక్సర్లతో మైదానాన్ని హోరెత్తించింది. ఓపెనర్లు అభిరథ్, వికాస్ పోటాపోటీగా ఆడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. కరీంనగర్ బౌలర్లకు చుక్కలు చూపించారు. బంతి పడటమే తరువాయి.. బౌండరీ అవతలకే అన్నట్లుగా ఆడారు. అతి ప్రమాదకరంగా మారిన ఈ జోడీని శుభం శర్మ విడగొట్టాడు. జట్టు స్కోరు 124 పరుగుల వద్ద 12.3వ బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించిన వికాస్‌రెడ్డి.. బౌండరీ లైన్ వద్ద సింహా చేతికి చిక్కి పెవిలియన్‌కు చేరాడు. అక్కడికి స్వల్ప వ్యవధిలోనే అఖిల్ వేసిన 15వ ఓవర్ చివరి బంతికి అభిరథ్.. సిక్స్ కొట్టే ప్రయత్నంలో రాథోడ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. చివర్లో వచ్చిన వైష్ణవ్ రెడ్డి (25), యశ్వీర్ (4) కలిసి టార్గెట్‌ను పూర్తి చేశారు. ఆదివారం జరిగే ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం జట్టుతో హైదరాబాద్ ఈ -ఛాంపియన్స్ తలపడనుంది.

# ఫ్రాన్స్ సెమీఫైనల్ బెర్త్ ఖరారు

## 2-0 గోల్స్ తేడాతో మొరాకోను మట్టికరిపించిన ఫ్రాన్స్



ఫిఫా వరల్డ్ కప్-2026 సీజన్‌లో ఫ్రాన్స్ జోరు ఏమాత్రం తగ్గడం లేదు. ఫ్రాన్స్ జట్టు మరోసారి తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. ఉత్కంఠభరితంగా సాగిన నాకౌట్ పోరులో2-0 గోల్స్ తేడాతో మొరాకోను మట్టికరిపించింది. ఈ గెలుపుతో సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఈ ఘన విజయంతో ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడోసారి (2018, 2022, 2026) సెమీఫైనల్‌కు చేరిన జట్టుగా ఫ్రాన్స్ సరికొత్త రికార్డు సృష్టించింది. మ్యాచ్ ఆరంభం నుంచే ఫ్రాన్స్ మైదానంలో దూకుడును ప్రదర్శించింది. బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆటపై పట్టు సాధించింది. ఈ క్రమంలో గోల్ చేయడానికి 30వ నిమిషంలో ఫ్రాన్స్ ఆశించిన అవకాశం లభించింది. స్టార్ ప్లేయర్ ఎంబాపె మొరాకో డిఫెన్స్‌ను దాటుకుంటూ బాక్స్ లోపలికి దూసుకెళ్లగా, మొరాకో డిఫెండర్ నౌసైర్ మజ్రావోయి అతడిని కిందపడేశాడు. దీనితో రెఫరీ ఫ్రాన్స్‌కు పెనాల్టీని ప్రకటించారు. ఎంబాపె షాట్ కొట్టగా, మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో అద్భుతమైన డైవ్‌తో ఎంబాపె కొట్టిన బంతిని చాలా సులువుగా పట్టుకుని ఫ్రాన్స్ సంబరాలను అడ్డుకున్నాడు. ఫస్టాఫ్ ముగిసే సమయానికి ఇరు జట్ల స్కోరు 0-0తో సమంగా నిలిచాయి. సెకండాఫ్‌లో మొరాకో జట్టు వ్యూహాత్మకంగా పుంజుకోవడానికి ప్రయత్నించింది. కానీ, ఫ్రాన్స్ ఆ జట్టును నిలువరించింది. మ్యాచ్ 60వ నిమిషంలో ఫ్రాన్స్ స్టార్ ఆటగాడు ఎంబాపె, బాక్స్ పైభాగం నుంచి బంతిని నెట్ ఫార్ కార్నర్‌లోకి పంపాడు. గోల్‌కీపర్ బోనో ఎంత ప్రయత్నించినా ఆ బంతిని ఆపలేకపోయాడు. ఈ అద్భుతమైన గోల్‌తో ఫ్రాన్స్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత వేగంగా కదిలింది. మొరాకో జట్టు కోలుకునే లోపే ఉస్మాన్ డెంబెలే మ్యాచ్ మైలురాయిని మార్చేశాడు. దూయే అందించిన పాస్‌ను అందుకున్న డెంబెలే బంతిని నెట్ బాట పట్టించాడు. దీంతో ఫ్రాన్స్ ఆధిక్యం 2-0కు చేరింది. రెండు గోల్స్ వెనుకబడిన మొరాకో మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి తమ స్టార్ ఆటగాళ్లు సోఫియాన్ రహిమి, సోఫియాన్ అమ్రబాత్, జకారియా ఎల్ ఊహాదీలను సబ్‌స్టిట్యూట్‌లుగా రంగంలోకి దించింది. కానీ, ఫలితం లేకుండా పోయింది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో మొరాకో గోల్ కోసం సర్వశక్తులూ ఒడ్డింది. చివరి నిమిషాల్లో ఫ్రాన్స్ తరఫున సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన మాతెటా,బార్కోలా జోడి మూడో గోల్ కోసం గట్టి ప్రయత్నం చేసింది. కానీ, అది సాధ్యం కాలేదు. దీంతో 2-0తో ఫ్రాన్స్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో చేసిన గోల్‌తో కెప్టెన్ కిలియన్ ఎంబాపె అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో పలు మైలురాళ్లను అందుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నేరుగా 100 గోల్స్‌లో భాగస్వామ్యాన్ని పంచుకున్న మొదటి ఆటగాడిగా ఎంబాపె నిలిచాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఫ్రాన్స్ తరఫున అతను ఇప్పటివరకు వ్యక్తిగతంగా 64 గోల్స్ చేయడమే చేశాడు. అలాగే, 36 గోల్స్ అసిస్ట్‌లు అందించాడు. దీంతో 100 గోల్స్ మైలురాయిని అందుకున్నాడు. 2018, 2022, 2026 ఎడిషన్లన్నింటిలో కలిపి ఎంబాపె ప్రపంచకప్‌లో తన మొత్తం గోల్స్ సంఖ్యను 20కి పెంచుకున్నాడు. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ (21 గోల్స్) ఆల్-టైమ్ రికార్డుకు ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు. ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో ఎంబాపెకు ఇది 8వ గోల్. దీంతో మెస్సీతో కలిసి ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా 'గోల్డెన్ బూట్' రేసులో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచాడు. ఈ మ్యాచ్‌లో చివరి 15 నిమిషాలు మిగిలి ఉండగా ఎంబాపె స్థానంలో జీన్-ఫిలిప్ మాతెటా సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చాడు. దీనితో ఎంబాపె గాయపడ్డాడనే వార్తలు గుప్పుమన్నాయి. మ్యాచ్ అనంతరం దీనిపై ఎంబాపె క్లారిటీ ఇచ్చాడు. అది చాలా చిన్న యాంకెల్ గాయం మాత్రమేనని, నేను పూర్తిగా బాగున్నానని చెప్పాడు. ఆ సమయంలో మ్యాచ్‌ను విజయవంతంగా ముగించడానికి నాకంటే మాతెటా అయితేనే బాగా సరిపోతాడని భావించి వ్యూహాత్మకంగా తీసుకున్న నిర్ణయం అదని చెప్పుకొచ్చాడు. తన ఫిట్‌నెస్ గురించి కంగారు పడాల్సిన అవసరం లేదన్నారు.



## ఈ20 పెట్రోల్‌తో మైలేజీ తగ్గేమాట వాస్తవమే, కానీ: కేంద్రం

**న్యూఢిల్లీ :** 20 శాతం ఇథనాల్ బ్లెండ్ చేసిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల కొన్ని వాహనాలలో మైలేజీ తగ్గే మాట వాస్తవమే అని కేంద్ర చమురు మంత్రిత్వ శాఖ అంగీకరించింది. అదే సమయంలో అధిక ఆక్టేన్ రేటింగ్, అధిక పికప్, కర్బన ఉద్గారాల తగ్గింపు వంటి ప్రయోజనాలను విస్మరించకూడదని పేర్కొంది. ఇథనాల్ కలిపిన పెట్రోల్ ప్రోగ్రామ్‌పై విమర్శలు వస్తున్న వేళ చమురు మంత్రిత్వ శాఖ 'సందేహాలు- సమాధానాలు' పేరుతో ఒక డాక్యుమెంట్‌ను శుక్రవారం విడుదల చేసింది. ఈ20 పెట్రోల్ వినియోగాన్ని ఆగమేఘాల మీద అమల్లోకి తెచ్చారన్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. సైంటిఫిక్ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు, దేశీయంగా ఇథనాల్ ఉత్పత్తి పెంపు చేపట్టిన అనంతరమే దశలవారీగా ఈ20 పెట్రోల్ వినియోగాన్ని తీసుకొచ్చినట్లు కేంద్రం పేర్కొంది. 2001లో పైలట్ ప్రాజెక్ట్ లాంచ్ అవ్వగా.. 2006 నాటికి దేశంలోని పలు చోట్ల 5 శాతం బ్లెండింగ్ అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. 2014లో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు 1.5 శాతం ఇథనాల్ బ్లెండింగ్ విధానమే అమల్లో ఉందని తెలిపింది. 2022 నాటికి 10 శాతానికి, 2025-26 నాటికి 20 శాతం బ్లెండింగ్‌ను దశలవారీగా సాధించగలిగామని తెలిపింది. పాత వాహనాలు పాడవుతాయన్న ఆందోళనలపై స్పందిస్తూ.. దేశవ్యాప్త వినియోగానికి ముందు ఈ20 వాహనం ఇంజిన్ మన్నిక, ఇంధన వ్యవస్థలు, మెటీరియల్ అనుకూలత, తుప్పు నిరోధకత, ఉద్గారాలకు సంబంధించి విస్తృతమైన పరీక్షలకు నిర్వహించినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రియల్ వరల్డ్ కండీషన్‌లో ఈ20 వల్ల తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం వంటివేవీ సర్వీస్ చేసిన వాహనాల్లో నిరూపితం కాలేదని పేర్కొంది. మారుతీ సుజుకీ, హీరో మోటోకార్ప్ కంపెనీల అభిప్రాయాలనూ ఉటంకించింది. పెట్రోల్ రకాన్ని వినియోగదారులు ఎంచుకునేలా ప్యూర్, ఈ10, ఈ20 ఇంధన ఆప్షన్లు ఇవ్వాలన్న డిమాండ్లపైనా కేంద్రం స్పందించింది. ఆ స్థాయిలో సప్లయ్ చైన్‌లు నిర్వహించడం వల్ల లాజిస్టిక్ ఖర్చులు పెరుగుతాయని తెలిపింది. దేశంలో ఉన్న లక్షకుపైగా రిటైల్ ఔట్‌లెట్లకు ఇంధన పంపిణీ ప్రక్రియ సంక్లిష్టంగా మారుతుందని వివరించింది. ఈ20 పెట్రోల్ ధర గురించి స్పందిస్తూ.. రైతులకు మెరుగైన ఆదాయం అందించే ఉద్దేశంతో ఇథనాల్ సేకరణకు ఒక నిర్దిష్ట మొత్తం నిర్ణయించినట్లు కేంద్రం పేర్కొంది. ఒకవేళ అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు ఈ20 పెట్రోల్ ధరనే.. సాధారణ పెట్రోల్ ధర కంటే కాస్త ఎక్కువగా ఉంటుందని తెలిపింది. కాబట్టి సంప్రదాయ పెట్రోల్ కంటే చౌకేమీ కాదని పేర్కొంది. ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ వల్ల రూ.1.97 లక్షల కోట్ల విదేశీ మారకం ఆదా అయ్యిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. సుమారు 316 లక్షల టన్నుల క్రూడాయిల్ దిగుమతుల్ని, 952 లక్షల టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించగలిగామని గణాంకాలతో వివరించే ప్రయత్నం చేసింది. 2014-15 నుంచి ఇప్పటి వరకు ఇథనాల్ సప్లయ్ వల్ల రైతులకు రూ.1.66 లక్షల కోట్లు ఆదాయం సమకూరిందని పేర్కొంది. కాబట్టి ఈ20 పెట్రోల్ గురించి అవాస్తవ సమాచారాన్ని విశ్వసించొద్దని కేంద్రం పౌరులకు సూచించింది.



## ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో ఇన్ఫినిట్ స్క్రోల్‌ను తీసేయండి

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ డిజైన్‌ను మార్చాలని, లేదంటే భారీ జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని మెటాను యూరోపియన్ యూనియన్ కమిషన్ హెచ్చరించింది. ఆయా ప్లాట్‌ఫామ్స్‌లో వీడియోల ఆటోప్లే, ఇన్ఫినిట్ స్క్రోల్ ఫీచర్లు వినియోగదారులకు వ్యసనంగా మారాయని ఆరోపించింది. దీనివల్ల ముఖ్యంగా పిల్లలు, యువత వాటికి బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తంచేసింది. అవసరమైన మార్పులు చేయకపోతే మెటా తన గ్లోబల్ వార్షిక టర్నోవర్‌లో 6 శాతం వరకు భారీ జరిమానా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో ఉండే ఇన్ఫినిట్ స్క్రోలింగ్ (అంతు లేని స్క్రోలింగ్), ఆటోప్లే వీడియోలు, పర్సనలైజ్డ్ రికమండేషన్స్ వంటి ఫీచర్లు మెదడును ఆటోపైలట్ మోడ్‌లోకి నెట్టేస్తున్నాయని, యూజర్లకు వ్యసనంగా మారాయని ఈయూ కమిషన్ ఆందోళన వ్యక్తం చేసింది. టీనేజర్ల కోసం మెటా ప్రవేశపెట్టిన టైమ్-మేనేజ్‌మెంట్ టూల్స్, పేరెంటల్ కంట్రోల్స్ అంత ప్రభావవంతంగా లేవని, వాటిని సులభంగా దాటవేయవచ్చని కమిషన్ అభిప్రాయపడింది. అయితే, యూరోపియన్ కమిషన్ ప్రాథమిక అంచనాలతో తాము ఏకీభవించడం లేదని మెటా పేర్కొంది. యువత రక్షణ కోసం తాము 'టీన్ అకౌంట్స్' వంటి చర్యలు తీసుకున్నామని, రాత్రి వేళల్లో ఇన్‌స్టాగ్రామ్ యాక్సెస్‌ను బ్లాక్ చేసేలా, స్క్రీన్ టైమ్‌ను రోజుకు 15 నిమిషాలకు పరిమితం చేసేలా తల్లిదండ్రులకు నియంత్రణ ఇచ్చామని మెటా ప్రతినిధి పేర్కొన్నారు. అయితే, దీనిపై కమిషన్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. దీనిపై మెటా తన సమాధానాన్ని ఈయూ కమిషన్‌కు సమర్పించాక.. తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

## ఆల్కహాల్ కలిసిన మందులకూ చీటీ తప్పనిసరి

**ఢిల్లీ:** ఆల్కహాల్ కలిగిన ఔషధాల విక్రయానికి సంబంధించిన నిబంధనలను కేంద్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టంచేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ పరిధిలోకి తీసుకొస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కొన్ని రకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఆల్కహాల్ శాతం ఎక్కువగా ఉంటోంది. దీంతో వాటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారంటూ పలు రాష్ట్రాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్, డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. దీనివల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి.



## షూటింగ్‌ల ఒత్తిడి నుంచి రెస్ట్

### యూరప్ టూర్ వెళ్లనున్న ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న సంగతి తెలిసిందే. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'స్పిరిట్', హను రాఘవపూడి డైరెక్షన్‌లో వస్తున్న 'ఫౌజీ' చిత్రాలతో పాటు బ్లాక్‌బస్టర్ హిట్స్ 'సలార్', 'కల్కి 2898 ' సీక్వెల్స్ కూడా ఆయన చేతిలో ఉన్నాయి. అయితే.. బ్యాక్ టు బ్యాక్ షూటింగ్‌లతో తీరిక లేకుండా గడుపుతున్న ప్రభాస్, త్వరలోనే కాస్త బ్రేక్ తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభాస్ హైదరాబాద్‌లో 'స్పిరిట్' సినిమా షూటింగ్‌లో పాల్గొంటున్నారు. హీరో ప్రభాస్ మరియు హీరోయిన్ త్రిప్తి డిమ్రి పై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. ఇక స్పిరిట్ లేటెస్ట్ షెడ్యూల్ పూర్తయిన వెంటనే ప్రభాస్ ఒక చిన్న విరామం తీసుకోనున్నారు. సుమారు పదిరోజుల పాటు వెకేషన్ కోసం ఆయన యూరప్ వెళ్లనున్నట్లు సమాచారం. యూరప్ టూర్ ముగించుకుని తిరిగొచ్చిన తర్వాత, ప్రభాస్ తన పూర్తి ఫోకస్‌ను 'ఫౌజీ' సినిమాపై పెట్టనున్నట్టుగా తెలుస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో పీరియాడిక్ లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంతో ఇమాన్వి హీరోయిన్‌గా పరిచయమవుతోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకోగా.. బ్యాలెన్స్ షూటింగ్‌ను కంప్లీట్ లో ఉన్నాడు డార్లింగ్. ఆ తర్వాత స్పిరిట్ పూర్తి చేసి.. కల్కి 2 సెట్స్‌లో జాయిన్ అవనున్నాడు. ఇక ఆ తర్వాత సలార్ 2 సెట్స్ పైకి వెళ్లనుంది. ప్రస్తుతానికి ప్రభాస్ ఈ భారీ లైనప్‌తో బిజీగా ఉన్నాడు. అందుకే.. ఒక స్మాల్ బ్రేక్ తీసుకుంటున్నాడని చెప్పొచ్చు.

## రోషన్ కనకాల కొత్త మూవీ ప్రారంభం

టాలీవుడ్ యువ నటుడు రోషన్ కనకాల కథానాయకుడిగా ఓ వినూత్నమైన భారీ ప్రాజెక్ట్ అధికారికంగా పట్టాలెక్కింది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా, సరికొత్త సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ కథాంశంతో తెరకెక్కనున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వైవిధ్యభరితమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట అయిన ప్రముఖ దర్శకుడు వి.ఐ. ఆనంద్ ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కి కథ, స్క్రీన్‌ప్లే అందించడమే కాకుండా, స్వయంగా సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. ఈ చిత్రంతో విజయ్ కె. కమిశెట్టి దర్శకుడిగా టాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ, ప్రేమ, వినోదం వంటి అన్ని రకాల వాణిజ్య అంశాలను కలగలిపి ప్రేక్షకులను ఒక సరికొత్త ఊహాజనిత ప్రపంచంలోకి తీసుకెళ్లేలా ఈ కథను సిద్ధం చేశారు. ఈ చిత్రంలో రోషన్ కనకాల సరసన గహాజీ కథానాయికగా నటిస్తోంది. ఇక అత్యంత వైభవంగా జరిగిన ఈ ముహూర్తపు వేడుకకు టాలీవుడ్ ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు బెస్ట్ విషెస్ తెలియజేశారు. యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, టాలీవుడ్ టాప్ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేసి చిత్ర బృందాన్ని ఆశీర్వదించారు. విజువల్ వండర్‌గా తెరకెక్కనున్న ఈ సినిమా టైటిల్‌ను మేకర్స్ ప్రస్తుతం సస్పెన్స్‌గా ఉంచారు, త్వరలోనే టైటిల్ మరియు పూర్తి నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు. అన్ని హంగులు అద్దుకుని త్వరలోనే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్‌ను జరుపుకోనుంది.



## విజయ్ జన నాయగన్‌కు ఎ సర్టిఫికెట్

### పలు మార్పులు సూచించిన సెన్సార్ బోర్డు




తమిళనాడు సీఎం, నటుడు విజయ్ కథానాయకుడిగా, హెచ్.వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన 'జన నాయగన్' చిత్రం ఎట్టకేలకు సెన్సార్ పనులు పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సెన్సార్ బోర్డు ఈ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్‌ను జారీ చేసింది. అయితే మొత్తం మూడు గంటల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాలో దాదాపు 12 కీలక మార్పులు చేయాలని బోర్డు సూచించింది. ఇందులో భాగంగా విజయ్ నేతృత్వంలోని రాజకీయ పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ప్రస్తావన ఉన్న డైలాగ్‌లను పూర్తిగా తొలగించాల్సి ఉంటుందని. అలాగే 'అంబేద్కర్ చట్టం' అనే డైలాగ్‌ను మార్చాలని, ఓ పుస్తకం కవర్‌పై అంబేద్కర్ ఉన్న విజువల్స్‌ను సవరించాలని బోర్డు స్పష్టం చేసింది. ఇక దేశభక్తికి సంబంధించిన అంశాల్లో భాగంగా భారత జాతీయ జెండా కింద పడుతున్నట్లు ఉన్న ఒక కీలకమైన షాట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. వీటితో పాటు సినిమాలో 'రంగనాథర్', 'ఓం' అనే పదాలతో పాటు 'ఆపరేషన్ మేలుహా' వివరణలో వచ్చే 'న్యూ ఇండియా' అనే పదాన్ని మ్యూట్ చేయాల్సిందిగా పేర్కొంది. సమాజంలో సున్నితమైన అంశాలకు సంబంధించి ఒక చిన్నారిని తగలబెడుతున్నట్లు ఉన్న విజువల్స్‌ను పూర్తిగా తొలగించి, వాటి స్థానంలో వేరే విజువల్స్ రీప్లేస్ చేయాలని బోర్డు వెల్లడించింది. అలాగే సినిమాలో 'షీలా రాణి' అనే పేరు ఎక్కడ వచ్చినా మార్చాలని, అంతర్జాతీయ అంశాలకు సంబంధించిన సద్దాం హుస్సేన్ ఉరితీత డైలాగ్‌ను కూడా మ్యూట్ లేదా రీప్లేస్ చేయాలని సూచించింది. వీటితో పాటు మరికొన్ని సన్నివేశాల్లో వచ్చే వివాదాస్పద పదాలను కూడా మ్యూట్ చేయాలని సెన్సార్ బోర్డు ఆదేశాల జాబితాలో పేర్కొంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా పూజా హెగ్డే నటించగా, మమితా బైజు కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ భారీ మార్పులన్నింటినీ పూర్తి చేసుకుని జులై 24న 'జన నాయగన్' థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది.

## చిత్రబృందం ఎంతో సపోర్ట్ చేసింది: రాశీఖన్నా

బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్, నటి రాశీ ఖన్నా, విద్యాబాలన్ ప్రధాన పాత్రల్లో, దర్శకుడు అనీస్ బజ్మీ ఓ కామెడీ సినిమాని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్‌లో యాక్షన్ సీన్లు చేస్తుండగా గాయాలు అయ్యాయని, చిత్రబృందం, కుటుంబం ఎంతో సపోర్ట్ చేసిందంటూ రాశీ ఖన్నా తెలిపారు. "ఈ మూవీ చిత్రీకరణ సమయంలో అనారోగ్యానికి గురయ్యాను. యాక్షన్ సన్నివేశాలు చేస్తుండగా గాయాలు అయ్యాయి. అయినా షూటింగ్ ఆపలేదు. నేను చేసిన షెడ్యూల్స్‌లో ఇది కష్టమైనది. అలాంటి రోజుల్లో నా కుటుంబం, తోటి నటులు, చిత్రబృందం ఇచ్చిన ధైర్యంతో షూటింగ్ చేయగలిగా. కెమెరాలు ఆగిపోయిన తర్వాత కూడా ఉండిపోయే జ్ఞాపకాలు ఇవే" అని రాశీ ఖన్నా ఇన్‌స్టాలో రాసుకొచ్చారు.





## భాగ్యశ్రీ బోర్సే అందాల మెరుపు

సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన తక్కువ సమయంలోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న యువ నటీమణుల్లో భాగ్యశ్రీ బోర్సే ఒకరు. ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ భామకు ఇప్పటివరకు ఆశించిన స్థాయి విజయం మాత్రం దక్కలేదు. తాజాగా అఖిల్ హీరోగా నటించిన 'లెనిన్' చిత్రంలో భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటించింది. ఈ సినిమా నేడు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే ఈ మూవీపై మంచి అంచనాలు నెలకొనగా, ఈ సినిమాతో భాగ్యశ్రీకు బ్రేక్ దక్కుతుందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ఈ చిత్రం ఆమె కెరీర్‌కు ఎలాంటి బూస్ట్ ఇస్తుందో చూడాలి. ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ భాగ్యశ్రీ బోర్సే యాక్టివ్‌గా ఉంటూ తరచూ తన లేటెస్ట్ ఫొటోషూట్‌లతో అభిమానులను ఆకట్టుకుంటోంది. మోడ్రన్ లుక్‌తో పాటు అప్పుడప్పుడు ట్రెడిషనల్ అవతార్‌లోనూ మెరిసి నెటిజన్ల ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ లంగా-వోణీలో దర్శనమిచ్చింది. రెండు చేతుల నిండా గాజులు, మెడలో సొగసైన హారం, పెద్ద ఇయర్‌రింగ్స్ ధరించి, కురులను అందంగా వెనక్కి వదులుతూ కెమెరాకు స్టైలిష్‌గా పోజులిచ్చింది.

# కొత్త కథనంతో వచ్చిన లెనిన్

### అఖిల్ నటనా తీరు అద్భుతం

టైటిల్ ప్రకటించిన నాటి నుంచీ అఖిల్ 'లెనిన్' సినిమాపై అంచనాలు మొదలయ్యాయి. అఖిల్ రగ్గడ్ గెటప్, కథా నేపథ్యం, ప్రచార చిత్రాలు, విడుదలైన పాటలు.. ఇవన్నీ సినిమాపై ఆసక్తిని పెంచాయి. అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మాతలు కావడంతో కచ్చితంగా సినిమా బావుంటుందని ఆడియన్స్ ఫిక్సయిపోయారు. అఖిల్ కెరీర్‌లో 'లెనిన్'కి వచ్చినంత హైప్ మరే సినిమాకూ రాలేదన్నది నిజం. ఎట్టకేలకు ఈ శుక్రవారం 'లెనిన్'గా అఖిల్ థియేటర్లలోకి అడుగపెట్టాడు. ఇది రాయలసీమలోని రామాపురం అనే గ్రామం పగలకు, ప్రతీకారాలకు దూరంగా ఉంటుంది. రక్తం ఆ నేలను అప్పటివరకూ తాకలేదు. ఆ ఊరిలో సంప్రదాయ జాతర జరుగుతుండగా, ఓ పదేళ్ల పిల్లాడు ఆ ప్రాంతంలోకి అడుపెట్టాడు. అ పిల్లాడి పేరు 'లెనిన్'. అమ్మానాన్న లేని అనాథ అయిన లెనిన్‌ని ఆ ఊరి పెద్దావిడ(ఈశ్వరీరావు) అక్కున చేర్చుకుంది. ఆమె కొడుకైన వసంత్(ప్రమోద్ పంజు)తో లెనిన్‌కి బలమైన స్నేహబంధం ఏర్పడింది. వసంత్‌తో పాటు లెనిన్ కూడా ఆ ఇంట్లోనే పెరిగి పెద్దయ్యాడు.. కట్ చేస్తే.. కొన్నేళ్ల తర్వాత లెనిన్ జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ ఊరిలోకి అడుగుపెట్టి ఆ ఊరి జనాలైన వందమందిని నరికి చంపాడు. చివరకు తన ప్రాణస్నేహితుడైన వసంత్‌ని కూడా అతి దారుణంగా పొడిచి చంపాడు. అసలు లెనిన్ జైలుకి ఎందుకెళ్లాడు? రక్తం రుచే తెలియని ఆ నేలపై రక్తపాతం ఎందుకు సృష్టించాడు? ప్రాణ స్నేహితుడైన వసంత్ ప్రాణాన్ని ఎందుకు బలి తీసుకున్నాడు? ఈ ప్రశ్నలకు సమాధానమే అసలు కథ. పరువు, ప్రేమ, స్నేహం, నమ్మకద్రోహం నేపథ్యంలో సాగే కథ ఇది. కథకుడు, దర్శకుడు మురలీకిశోర్ అబ్బూరి ఈ కథను నడిపించిన తీరు బావుంది. ఇదొక విభిన్నమైన స్క్రీన్‌ప్లే. ప్రథమార్థం ఇదేదో పరువు కోసం ప్రాణాలు తీసే వ్యక్తుల చుట్టూ తిరిగే కథగానే అంతా భావిస్తారు. కానీ సెకండాఫ్‌లో ఈర్ష్య, ద్వేషం, నమ్మకద్రోహం కోణాలు కథలో బహిర్గతమవుతాయి. ఈర్ష్య, ద్వేషం అనేవి పవిత్రమైన స్నేహాన్ని సైతం నిర్వీర్యం చేస్తాయని ఈ కథ ద్వారా మురలీకిశోర్ అబ్బూరి తెలిపారు. అనాధగా ఆ ఊరు వచ్చిన లెనిన్ 'నా' అనుకున్న




వారందర్నీ సంపాదించుకున్నానని భ్రమ పడతాడు. తాను ఎప్పటికీ అనాథనేనని తెలుసుకుకోవడంతో కథ ముగుస్తుంది. స్నేహానికీ, ప్రేమకీ లొంగిపోయే లెనిన్ నమ్మకద్రోహానికి బలైపోయాడు. అదే ఈ సినిమా కథ. చాలా సీరియస్ సబ్జెక్ట్ ఇది. క్షణక్షణానికి మారుతున్న వ్యక్తులు మనస్తత్వాలను ఈ సినిమాలో చూడొచ్చు. మంచి వాళ్లుగా కనిపిస్తున్న మేకవన్నె పులుల మధ్య జీవితాన్ని సాగించి, సర్వం కోల్పోయిన లెనిన్‌ని ఈ సినిమాలో చూడొచ్చు. ప్రథమార్ధం చివరి ఇరవై నిమిషాల్లో సినిమాలోని అసలు కథ మొదలైంది. కథలోకి వెళ్లడం ఆలస్యం కావడం వల్ల కథనం నిదానించినట్టు అనిపిస్తుంది. ద్వితీయార్ధం ఆద్యంతం ఊహించని మలుపులతో ఆసక్తికరంగా సినిమా సాగింది. మొత్తంగా దర్శకుడు మురలీకిశోర్ వైవిధ్యమైన కథనంతో ఈ కథను నడిపించి సినిమాను నిలబెట్టారు. ఇక 'లెనిన్'గా కొత్త అఖిల్‌ని ఈ సినిమాలో చూస్తారు. ఇప్పటివరకూ ఆయన చేసిన సినిమాలన్నీ ఒకెత్తూ, 'లెనిన్' ఒకెత్తు. అమాయకత్వం, మంచి తనం, మూర్ఖత్వం కలగలిసిన ఈ పాత్రలో అఖిల్ జీవించాడనే చెప్పాలి. అతనిలోని పరిపూర్ణమైన నటుడ్ని 'లెనిన్'లో చూడొచ్చు. ముఖ్యంగా ద్వితీయార్ధంలో అఖిల్ అద్భుతంగా నటించాడు. అతని కెరీర్‌లో బెస్ట్ పెర్ఫార్మెన్స్‌గా 'లెనిన్'ని చెప్పొచ్చు. ఇక భాగ్యశ్రీబోర్సే తనదైన అందచందాలతోపాటు చక్కటి అభినయంతో కూడా ఆకట్టుకున్నది. ఈ సినిమాలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన వసంత్‌గా నటించిన ప్రమోద్ పంజు గురించి. తనది ఇందులో మేకవన్నె పులి లాంటిపాత్ర. మంచివాడిగా కనిపిస్తూ ఉన్నట్టుండి దుర్మార్గుడిగా ఎస్టాబ్లిష్ అయ్యే పాత్ర అది. ఆ పాత్రలో తన నిజంగా అదరహో అనిపించాడు. ఈ సినిమాతో అతనికి మంచి పేరు రావడం ఖాయం. ఇక శివాజీ, ఈశ్వరీరావు, రాంకీ.. ఇలా అంతా పరిధిమేర పాత్రలకు న్యాయంచేశారు.

PUBLISHED AND OWNED BY **DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS** 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083.,**EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132**, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com